




TE TL/26/A2635

DD9 వాస్తవాలు పలుకు

# వార్త

తెలుగు దినపత్రిక




హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక:37 | 02-08-2026 ఆదివారం | పేజీలు: 08 | వెల 3/-

## తలసరి ఆదాయంలో గణనీయ వృద్ధి.. తెలంగాణ అభివృద్ధి జోరు: సీఎం

- పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో రాష్ట్ర ప్రగతి
- 2025-26లో తలసరి ఆదాయం రూ.4.18 లక్షలకు చేరిందని వెల్లడి
- ఏడాదిలోనే 10.23 శాతం వృద్ధి నమోదు



**హైదరాబాద్, ఆగస్టు 1**

కొత్త ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత తెలంగాణ అభివృద్ధి మరింత వేగం అందుకుందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. సరైన విధానాలు, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల కల్పనతో రాష్ట్రం దేశంలోనే వేగంగా అభివృద్ధి

మిగతా 2వ పేజీలో..

## హైడ్రా పనితీరుపై సీఎం ప్రశంసలు..

- చెరువుల పునరుద్ధరణకపై అభినందనలు
- ఉప్పల్ నల్ల చెరువు పునరుజ్జీవనంపై సంతృప్తి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి
- హైడ్రా అధికారులు, సిబ్బంది సేవలను కొనియాడిన రేవంత్ రెడ్డి

2



2

## పప్పు, పామాయిల్ సాగుపై దృష్టి పెట్టాలి: గవర్నర్

- హార్టికల్చర్ అభివృద్ధి చర్యలను ప్రశంసించిన శివ ప్రతాప్ శుక్ల




# కేబినెట్ విస్తరణకు బ్రేక్

- ఢిల్లీ చర్చల తర్వాత మంత్రి పదవులపై హైకమాండ్ నిరీక్షణ.. ఆశావహులకు నిరాశ
- తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు ప్రస్తుతానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వని కాంగ్రెస్ అధిష్ఠానం
- ఢిల్లీలో మూడు రోజుల చర్చల అనంతరం పాలనపైనే దృష్టి పెట్టాలని నేతలకు సూచన
- ఖాళీ బెర్తుల భర్తీ చేస్తే అసంతృప్తి పెరిగే అవకాశం ఉందనే అంచనా
- సీనియర్లు, యువ ఎమ్మెల్యేల మధ్య మంత్రి పదవుల పోటీతో క్లిష్టమైన సమీకరణాలు
- ప్రతి 45 రోజులకు సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఆదేశం
- స్థానిక సంస్థలు, ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాలపై దృష్టి పెట్టాలని హైకమాండ్ సూచన

**హైదరాబాద్, ఆగస్టు 1:**

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రివర్గ విస్తరణపై నెలకొన్న ఉత్కంఠకు ప్రస్తుతానికి తెరపడినట్లైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు రాష్ట్రానికి చెందిన ముఖ్య నాయకులు ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్ఠానంతో నిర్వహించిన వరుస సమావేశాల్లో కేబినెట్ విస్తరణ అంశం చర్చకు వచ్చినప్పటికీ, ఈ దశలో ఎలాంటి మార్పులు చేపట్టవద్దని పార్టీ పెద్దలు నిర్ణయించినట్లు సమాచారం. దీంతో మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్న పలువురు ఎమ్మెల్యేలకు నిరాశ ఎదురైంది.

**అసంతృప్తికి అవకాశం ఇవ్వొద్దన్న నిర్ణయం**

ప్రస్తుతం ఖాళీగా ఉన్న మంత్రి పదవులను భర్తీ చేయడం లేదా శాఖల మార్పులు చేపట్టడం వల్ల పార్టీలో కొత్త అసంతృప్తికి తావిచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఇతర రాష్ట్రాల్లో ఎదురైన

మిగతా 2వ పేజీలో..



## క్రిమినల్ వేస్ట్ వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో దుమారం

- ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలంటూ ప్రతిపక్షాల డిమాండ్
- జెన్-జీ అసంతృప్తిని ఉద్యమంగా మలిచే ప్రయత్నాలు
- సామాజిక మాధ్యమాల్లో హ్యాష్‌ట్యాగ్‌లు, మీమ్‌లతో ప్రతిస్పందన

2



## జెన్‌జీ ఉద్యమంతో దిగొచ్చిన కేంద్రం: కేటీఆర్

- ఢిల్లీ ఉద్యమం కేంద్రాన్ని స్పందించేలా చేసిందని వ్యాఖ్య
- యువత శక్తిని తక్కువ అంచనా వేయొద్దని సూచన
- సోషల్ మీడియానే మార్పుకు ప్రధాన వేదిక అని అభిప్రాయం
- సీఎం రేవంత్ వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ స్పందించాలని డిమాండ్

2

## ప్రాణదాతగా హైదరాబాద్ మెట్రో..

- 25 నిమిషాల్లో అవయవాల తరలింపు
- గ్రీన్ ఛానెల్‌తో గుండె, ఊపిరితిత్తుల అత్యవసర రవాణా
- గచ్చిబౌలి నుంచి సికింద్రాబాద్‌కు వేగంగా చేరిన అవయవాలు
- 14 కిలోమీటర్ల ప్రయాణం కేవలం 25 నిమిషాల్లో పూర్తి
- అత్యవసర వైద్య సేవలకు పూర్తి సహకారం అందిస్తామని మెట్రో అధికారులు వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు 1**

అత్యవసర అవయవ మార్పిడి కోసం హైదరాబాద్ మెట్రో మరోసారి ప్రాణదాతగా నిలిచింది. గచ్చిబౌలిలోని ఆసుపత్రి నుంచి సికింద్రాబాద్‌లోని మరో ఆసుపత్రికి గుండె, ఊపిరితిత్తులను ప్రత్యేక గ్రీన్ ఛానెల్ ద్వారా కేవలం 25 నిమిషాల్లో సురక్షితంగా





## తెలంగాణ రైతాంగం జీవనాడి ఎస్సారెస్పీ: ఉత్తమ్ కుమార్ రెడ్డి

- ఎస్సారెస్పీ పూడికతీతకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం
- రెండు రోజుల్లో సాగునీటి విడుదలపై నిర్ణయం
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శ
- రైతులకు సాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ

**నిజామాబాద్, ఆగస్టు 1**

శ్రీరాంసాగర్ (ఎస్సారెస్పీ) ప్రాజెక్టు తెలంగాణ రైతాంగానికి జీవనాడిగా నిలిచిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలోని ఎస్సారెస్పీ ప్రాజెక్టును సందర్శించి జలాశయ పరిస్థితిని పరిశీలించిన ఆయన, గోదావరి పరివాహక ప్రాంతాల్లోని

మిగతా 3వ పేజీలో..

### ఉత్తర తెలంగాణ రైతులకు సాగునీరే లక్ష్యం: ఉత్తమ్

- గోదావరి జలాల వినియోగంపై సమగ్ర అధ్యయనం చేస్తున్న ప్రభుత్వం
- ఎల్లంపల్లి రిజర్వాయర్‌ను పరిశీలించిన మంత్రుల బృందం
- కాళేశ్వరం బ్యారేజీలపై మంత్రుల విమర్శలు

3

## అసెంబ్లీలో విద్వేష ప్రసంగాలకు చెక్..

- స్పీకర్ ఛాంబర్‌లో కమిటీ కీలక భేటీ
- విద్వేష ప్రసంగాల నియంత్రణ బిల్లుపై విస్తృత చర్చ
- వర్షాకాల సమావేశాల ముగిసేలోపు నివేదిక సమర్పణకు కసరత్తు
- భావప్రకటనా స్వేచ్ఛకు భంగం కలగకుండా చట్టం: పొన్నం




**హైదరాబాద్, ఆగస్టు 1**

శాసనసభలో విద్వేషపూరిత, రెచ్చగొట్టే వ్యాఖ్యలను నియంత్రించేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకురానున్న చట్టానికి సంబంధించి కసరత్తు ముమ్మరమైంది. ఈ నేపథ్యంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో సెలెక్ట్ కమిటీ చైర్మన్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన కీలక సమావేశం నిర్వహించారు. సమావేశానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు కమిటీ సభ్యులు హాజరై బిల్లుకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. విద్వేష ప్రసంగాల

మిగతా 2వ పేజీలో..

## ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త దిశ..

- రూ.18 వేల కోట్ల ప్రాజెక్టులకు మోదీ శ్రీకారం
- భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్రకు అభివృద్ధి రన్‌వే అవుతుందన్న ప్రధాని
- స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో కీలక మైలురాయిగా అభివర్ణన



2



## పక్కా వ్యూహంతో రూ.52 కోట్ల మోసాన్ని ఛేదించిన భద్రాద్రి పోలీసులు

7

## కాంట్రాక్టర్ నిర్లక్ష్యం...!!

- నరకయాతనలో ఎల్‌బీ నగర్ ప్రజలు
- పగిలిన డ్రైనేజ్.. నిలిచిన టాయిలెట్ కనెక్షన్
- 5 రోజులుగా నరకయాతనలో మహిళలు, చిన్నారులు

7



## తలసరి ఆదాయంలో గణనీయ వృద్ధి.. తెలంగాణ అభివృద్ధి జోరు: సీఎం

**మొదటిపేజీ తరువాయి**

చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు. 202526 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. గత ఏడాదితో పోలిస్తే ఒక్కో వ్యక్తి ఆదాయం రూ.38,900 పెరిగిందని, ఒకే ఏడాదిలో 10.23 శాతం వృద్ధి నమోదు కావడం రాష్ట్ర ఆర్థిక బలోపేతానికి నిదర్శనమని చెప్పారు. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ సమర్థవంతమైన ప్రణాళికలు అమలు చేయడం, పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించడం వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతమైందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలన, ఆర్థిక క్రమశిక్షణతో అభివృద్ధి ఫలితాలను ప్రజలకు చేరవేస్తున్నామని తెలిపారు. గతంలో ఉన్న పరిపాలనా లోపాలను అధిగమించి ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించగలిగామని ముఖ్యమంత్రి అన్నారు. ఇదే అభివృద్ధి వేగాన్ని కొనసాగిస్తూ తెలంగాణను అన్ని రంగాల్లో మరింత ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు.

## కేబినెట్ విస్తరణకు బ్రేక్

**మొదటిపేజీ తరువాయి**

అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణలో ప్రభుత్వం స్థిరంగా పనిచేసేలా చూడటమే ప్రస్తుతం ప్రాధాన్యమని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**క్లిష్టమైన సామాజిక సమీకరణాలు**

మంత్రి పదవుల కోసం పలువురు సీనియర్ ఎమ్మెల్యేలతో పాటు యువ నాయకులు కూడా పోటీలో ఉండటంతో సమీకరణాలు మరింత సంక్లిష్టంగా మారినట్లు తెలుస్తోంది. ప్రాంతీయ, సామాజిక, రాజకీయ సమతుల్యతను ఒకేసారి సాధించడం సవాల్‌గా మారడంతో, విస్తరణ నిర్ణయాన్ని వాయిదా వేయడమే ఉత్తమ మార్గమని అధిష్ఠానం భావించినట్లు సమాచారం.

**పాలనపైనే ప్రధాన దృష్టి**

ఢిల్లీ సమావేశాల్లో ప్రభుత్వ పనితీరు, సంక్షేమ కార్యక్రమాల అమలు, పార్టీ-ప్రభుత్వ సమన్వయంపై ప్రత్యేకంగా చర్చ జరిగినట్లు తెలిసింది. ప్రతి 45 రోజులకు ఒకసారి సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించాలని, ప్రభుత్వ కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంపై దృష్టి సారించాలని నాయకత్వానికి సూచించినట్లు సమాచారం. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, ఓటర్ల నమోదు ప్రక్రియపై పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని ఆదేశించినట్లు తెలుస్తోంది.

**ఆశావహులకు స్పష్టమైన సంకేతం**

మంత్రి పదవుల కోసం ఎదురుచూస్తున్న నేతలకు ప్రస్తుతం నిరీక్షణ తప్ప మరో మార్గం లేదనే సంకేతాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం ఇచ్చినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ప్రభుత్వం పనితీరును బలోపేతం చేయడం, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత పటిష్ఠం చేయడంపైనే దృష్టి పెట్టాలని స్పష్టం చేయడంతో, తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రివర్గ విస్తరణ అంశం మరోసారి వాయిదా పడినట్లుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## అసెంబ్లీలో విద్వేష ప్రసంగాలకు చెక్..

**మొదటిపేజీ తరువాయి**

నియంత్రణతో పాటు ప్రతిపాదిత క్రైమ్ బిల్లులో పొందుపరచాల్సిన నిబంధనలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. శాసనసభలో సభ్యులు భావప్రకటనా స్వేచ్ఛను వినియోగించుకునే హక్కును కాపాడుతూనే, వ్యక్తిగత దూషణలు, విద్వేషాన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలను నిరోధించేలా చట్టానికి రూపకల్పన చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

శాసనసభ వర్షాకాల సమావేశాలు ముగిసేలోపు బిల్లుకు సంబంధించిన పూర్తి నివేదికను సభకు సమర్పించాలని కమిటీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇందుకోసం వచ్చే వారం మరోసారి సమావేశమై ముసాయిదాపై తుది చర్చలు జరపనున్నట్లు తెలిపారు.

వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, న్యాయ నిపుణులు, సామాజిక వేత్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని బిల్లుకు తుది రూపు ఇవ్వనున్నట్లు పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఈ చట్టం ప్రజాప్రతినిధుల భావప్రకటనా స్వేచ్ఛను పరిమితం చేయడానికి కాదని, శాసనసభ గౌరవాన్ని కాపాడుతూ వ్యక్తుల ఆత్మగౌరవానికి భంగం కలగకుండా చూడడమే ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.

## కామన్వెల్త్ స్వర్ణ విజేతలకు సీఎం అభినందనలు

- **జాస్మిన్, ప్రీతి విజయాలు దేశానికి గర్వకారణమన్న రేవంత్**
- **యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్ష**
- **అంతర్జాతీయ వేదికపై మరిన్ని విజయాలు సాధించాలని శుభాకాంక్షలు**
- **క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ**

**హైదరాబాద్, ఆగస్టు 1**

గ్లాస్గోలో జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణ పతకాలు సాధించిన భారత మహిళా బాక్సర్లు జాస్మిన్ లాంబోరియా, ప్రీతి పవార్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అభినందించారు. అంతర్జాతీయ వేదికపై భారత కీర్తిని చాటిన వారి ప్రదర్శన దేశానికి గర్వకారణమని కొనియాడారు. మహిళల 57 కిలోల విభాగంలో జాస్మిన్ లాంబోరియా, 54 కిలోల విభాగంలో ప్రీతి పవార్ స్వర్ణ పతకాలు గెలుచుకోవడం భారత బాక్సింగ్‌కు మరో గొప్ప విజయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భారత జెండాను ప్రపంచ వేదికపై రెపరెపలాడించిన ఈ ఇద్దరు క్రీడాకారిణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

జాస్మిన్, ప్రీతి ప్రదర్శించిన కృషి, పట్టుదల, అంకితభావం యువ క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తాయని రేవంత్ రెడ్డి అన్నారు. ఇలాంటి విజయాలు భావితరాల్లో క్రీడలపై ఆసక్తిని పెంచడంతో పాటు మరింత ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ అంతర్జాతీయ పోటీల్లో ఇదే జోరు కొనసాగించి మరిన్ని పతకాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహించడంలో తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, భారత క్రీడాకారులు ప్రపంచ వేదికపై మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



# హైడ్రా పనితీరుపై సీఎం ప్రశంసలు..

**హైదరాబాద్, ఆగస్టు 1**

హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు, జలవనరుల పునరుద్ధరణలో హైడ్రా చేపడుతున్న చర్యలను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రశంసించారు. చెరువుల పునరుజ్జీవనంతో నగరం కొత్త రూపును సంతరించుకుంటోందని, ఈ మార్పు తనకు ఎంతో సంతృప్తిని కలిగిస్తోందని ఆయన సామాజిక మాధ్యమం ద్వారా పేర్కొన్నారు.ఉప్పల్ నల్ల చెరువు పునరుద్ధరణ కోసం శ్రమించిన హైడ్రా అధికారులు, సిబ్బందిని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఆక్రమణలు, వ్యర్థాలతో దెబ్బతిన్న చెరువులను ప్రణాళికాబద్ధంగా శుభ్రపరచి మళ్లీ జీవం పోస్తుండటం అభినందనీయమని చెప్పారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భావితరాలకు మెరుగైన సహజ వనరులను అందించడంలో హైడ్రా కీలక బాధ్యత నిర్వహిస్తోందని కొనియాడారు.

చెరువుల సంరక్షణ అనేది కేవలం నీటి వనరులను కాపాడడం మాత్రమే కాదని, భవిష్యత్ తరాలకు భద్రమైన జీవన వాతావరణాన్ని అందించడమేనని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నగరంలోని ఆక్రమణలకు గురైన చెరువులను పరిరక్షించడంతో పాటు ప్రభుత్వ భూములు, ప్రజా ఆస్తులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

హైడ్రా చేపడుతున్న చర్యలు హైదరాబాద్‌కు పర్యావరణపరంగా, అభివృద్ధి పరంగా కొత్త గుర్తింపును తీసుకొస్తున్నాయని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాలను ఇదే వేగంతో కొనసాగించి నగర జలవనరులను పరిరక్షించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు.

## క్రిమినల్ వేస్ట్ వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో దుమారం

**హైదరాబాద్, ఆగస్టు 1**

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల ఉద్యోగార్హతలు, నైపుణ్యాలపై చేసిన "క్రిమినల్ వేస్ట్" వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రతి ఏడాది లక్షకు పైగా ఇంజినీరింగ్ పట్టభద్రులు బయటకు వస్తున్నప్పటికీ ఉద్యోగాలకు అవసరమైన కనీస నైపుణ్యాలు కూడా చాలామందిలో కనిపించడం లేదని వ్యాఖ్యానించిన సీఎం మాటలను ప్రతిపక్షాలు యువతను అవమానించేలా ఉన్నాయని విమర్శిస్తున్నాయి. దీంతో ఈ అంశం రాజకీయంగా వేడెక్కింది.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీష్ రెడ్డి ముఖ్యమంత్రి విద్యార్థులు, ఉపాధ్యాయులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. యువత ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపించిన వారు, జెన్‌జీ విద్యార్థులు ఈ వ్యాఖ్యలను తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. బీజేపీ నేత ఈటల రాజేందర్ కూడా సీఎం వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ వివరణ ఇవ్వాలని కోరారు.

ఈ వివాదం సామాజిక మాధ్యమాల్లో మరింత వేగంగా విస్తరిస్తోంది. "మేము క్రిమినల్ వేస్ట్ కాము", "నవ తెలంగాణ నిర్మాతలం" వంటి హ్యాష్‌ట్యాగ్‌లతో పోస్టులు, మీమ్‌లు, షార్ట్ వీడియోలు విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి. వివాదాస్పద పదాలను నిరసన చిహ్నాలుగా మలిచే డిజిటల్ ధోరణిని ప్రతిపక్షాలు రాజకీయంగా వినియోగించుకునే ప్రయత్నం చేస్తున్నాయని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. యువతలో అసంతృప్తిని మరింత బలంగా ప్రతిబింబించేలా ఆన్‌లైన్ ప్రచారాన్ని కొనసాగిస్తున్నాయి. మరోవైపు, ముఖ్యమంత్రి వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు సమర్థిస్తున్నారు. విద్యార్థులను అవమానించడం తమ ఉద్దేశం కాదని, నైపుణ్యాల కొరతతో ఉన్న విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరాన్ని మాత్రమే సీఎం ప్రస్తావించారని చెబుతున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విద్యా విధానంలో సంస్కరణలు తీసుకొచ్చి ప్రాక్టికల్ శిక్షణ, విదేశీ భాషలు, అప్రెంటిస్‌షిప్‌కు ప్రాధాన్యం కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వివరిస్తున్నారు.

విద్యా వ్యవస్థలోని లోపాలను ప్రస్తావించే క్రమంలో ఉపయోగించిన పదజాలమే ఇప్పుడు రాజకీయ వివాదానికి కేంద్రబిందువైంది. ఒకవైపు ప్రతిపక్షాలు దీనిని యువత ఆత్మగౌరవ సమస్యగా ప్రచారం చేస్తుండగా, మరోవైపు ప్రభుత్వం ఇది విద్యా సంస్కరణలపై జరిగిన చర్చ మాత్రమేనని స్పష్టం చేస్తోంది. ఈ వివాదం రాజకీయంగా ఎంత వరకు ప్రభావం చూపుతుందనేది రానున్న రోజుల్లో తేలనుంది.



## జెన్‌జీ ఉద్యమంతో దిగొచ్చిన కేంద్రం: కేటీఆర్

**హైదరాబాద్, ఆగస్టు 1**

జెన్‌జీ యువత చేపట్టిన ఉద్యమం ప్రభావంతో కేంద్ర ప్రభుత్వం స్పందించాల్సి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. దేశ యువత శక్తిని ఎవరూ తక్కువ అంచనా వేయొద్దని, ఢిల్లీలో జరిగిన ఉద్యమం రాజకీయ వర్గాలకు కొత్త సందేశాన్ని ఇచ్చిందన్నారు. ఓ తెలుగు దినపత్రిక వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

జెన్‌జీ యువత ఢిల్లీలో చేపట్టిన ఆందోళనల దెబ్బకు ప్రధాని నరేంద్ర మోదీ అర్ధరాత్రి వీడియో విడుదల చేయాల్సి వచ్చిందని కేటీఆర్ అన్నారు. యువతతో తలపడటం ఎవరికీ మంచిది కాదని, వారు ఒకసారి ఉద్యమ బాట పట్టితే ప్రభుత్వాలనే కదిలించే శక్తి ఉందని పేర్కొన్నారు. సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలకు భయపడే తరం జెన్‌జీ కాదని వ్యాఖ్యానించారు.

దేశ యువతలో దేశభక్తి, బాధ్యతా భావం లేదనే అభిప్రాయం తప్పని ఇటీవలి పరిణామాలు నిరూపించాయని కేటీఆర్ అన్నారు. ప్రధాన ప్రతిపక్షాలు చేయలేని పనిని యువత చేసి చూపించిందని, వారి ఉద్యమం కొత్త రాజకీయ దిశను చూపిందని పేర్కొన్నారు. సంప్రదాయ రాజకీయాల కంటే భిన్నంగా యువత ఆలోచిస్తోందని అన్నారు.

సోషల్ మీడియా ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషిస్తోందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. దానికి పరిమితులు విధించడం వాక్ స్వాతంత్ర్యానికి విరుద్ధమని చెప్పారు. సోషల్ మీడియా లేకుంటే ప్రభుత్వాల్లో చలనం వచ్చేదే కాదని, ప్రజల గొంతుకకు అదే ప్రధాన వేదికగా మారిందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాషపై కూడా కేటీఆర్ విమర్శలు చేశారు. రాజకీయాల్లో పరస్పర గౌరవం ఉండాలని, ఈ విషయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ జోక్యం చేసుకోవాలని కోరారు. మీడియాను ప్రభావితం చేసి ప్రజల్లో అభిప్రాయాలను మలచాలని ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నప్పటికీ, యువత ఉద్యమం అలాంటి రాజకీయ ధోరణులకు భిన్నమైన మార్పును తీసుకొచ్చిందని కేటీఆర్ అన్నారు.




## ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త దిశ..

**విశాఖపట్నం, ఆగస్టు 1**

ఉత్తరాంధ్ర గడ్డపై అడుగుపెట్టడం తనకు ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సహా సుమారు రూ.18 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించిన ఆయన, ఇవి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కొత్త ఊపు తీసుకువస్తాయని పేర్కొన్నారు.

సభలో తెలుగులో అందరికీ నమస్కారం అంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన ప్రధాని, సింహాచలం అప్పన్న స్వామి, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు అర్పించారు. స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో నేటి కార్యక్రమం కీలక ఘట్టమని పేర్కొంటూ, రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో ఈ ప్రాజెక్టులు ముఖ్యపాత్ర పోషిస్తాయని అన్నారు.

కార్యక్రమంలో గిరిజన మహిళలు ప్రదర్శించిన థింసా నృత్యం తనను ఎంతగానో ఆకట్టుకుందని మోదీ చెప్పారు. ఒకేసారి వేలాది మంది గిరిజన మహిళలు ఈ నృత్యాన్ని ప్రదర్శించడం భారత సాంస్కృతిక వైభవానికి నిదర్శనమని కొనియాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వాన్ని కూడా అభినందించారు.



భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వేగా మారుతుందని ప్రధాని తెలిపారు. ఇది యువతకు ఉపాధి, పెట్టుబడులు, పారిశ్రామిక అవకాశాలకు ద్వారాలు తెరుస్తుందని పేర్కొన్నారు. గతంలో విమానాశ్రయాలకు ఒకే కుటుంబం పేర్లు పెట్టేవారని, తమ ప్రభుత్వం మాత్రం దేశానికి సేవలందించిన మహనీయుల పేర్లను గౌరవిస్తోందని చెప్పారు. భోగాపురం విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం గర్వకారణమని, ఈ ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

## ప్రాణదాతగా హైదరాబాద్ మెట్రో..

**మొదటిపేజీ తరువాయి**

తరలించి అవయవ మార్పిడికి కీలక సహకారం అందించింది.

గచ్చిబౌలిలోని కేర్ ఆసుపత్రిలో దానం చేసిన గుండె, ఊపిరితిత్తులను సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి అత్యవసరంగా తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రహదారులపై ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని వైద్య బృందం మెట్రో అధికారులను సంప్రదించగా, వారు వెంటనే ప్రత్యేక గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేశారు. దీంతో సుమారు 14 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 25 నిమిషాల్లో పూర్తి చేసి అవయవాలను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చారు. సమయానికి అవయవాలు చేరడంతో మార్పిడి ప్రక్రియకు అవసరమైన కీలక సమయం ఆదా అయింది.

భవిష్యత్తులో కూడా ఇలాంటి అత్యవసర వైద్య అవసరాలు, ప్రాణ రక్షణ కార్యక్రమాలకు తమవంతు సహకారం అందిస్తామని హైదరాబాద్ మెట్రో అధికారులు తెలిపారు. సమయస్ఫూర్తితో స్పందించి అవయవాల రవాణాను విజయవంతం చేసిన మెట్రో సిబ్బందిపై వైద్య వర్గాలు, ప్రజలు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.

## పప్పు, పామాయిల్ సాగుపై దృష్టి పెట్టాలి: గవర్నర్

- **దిగుమతుల భారం తగ్గించేందుకు ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం**
- **ఎల్‌నినో నిపుణుల కమిటీ నివేదికను స్వీకరించిన గవర్నర్**
- **వ్యవసాయ రంగానికి దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమని సూచన**

**హైదరాబాద్, ఆగస్టు 1**

దేశంలో పప్పు దినుసులు, వంటనూనెల కొరతను అధిగమించేందుకు పప్పు పంటలు, పామాయిల్ సాగుపై మరింత దృష్టి సారించాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల సూచించారు. దిగుమతులపై ఆధారపడే పరిస్థితిని తగ్గించేందుకు ఈ పంటల సాగును విస్తరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

లోక్ భవన్‌లో శనివారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, ఎల్‌నినో ప్రభావంపై నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా గవర్నర్‌ను కలిసి ఎల్‌నినో ప్రభావంపై రూపొందించిన నిపుణుల కమిటీ నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయం, అనుబంధ రంగాలపై గవర్నర్ వారితో విస్తృతంగా చర్చించారు.

దేశంలో పప్పు దినుసుల ఉత్పత్తి అవసరాలకు సరిపోకపోవడంతో భారీ మొత్తంలో విదేశాల నుంచి దిగుమతులు చేసుకోవాల్సి వస్తోందని గవర్నర్ తెలిపారు. పప్పు దినుసుల దిగుమతుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని పేర్కొన్నారు. అదే విధంగా వంటనూనెల అవసరాల కోసం కూడా భారీగా విదేశాలపై ఆధారపడుతున్న పరిస్థితిని తగ్గించాలంటే ఆయిల్ పామ్ సాగును మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

పప్పు దినుసులు, పామాయిల్ సాగు పెరిగితే రాష్ట్రంతో పాటు దేశ అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తుందని గవర్నర్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఉద్యానవన పంటలు, కూరగాయల సాగు అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సానుకూల ఫలితాలు ఇస్తున్నాయని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు నిపుణుల కమిటీ చేసిన సిఫార్సులు సమగ్రంగా ఉన్నాయని గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రశంసించారు. వ్యవసాయ రంగానికి ఉపయోగపడే విలువైన సూచనలను అందించిన కమిటీ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డితో పాటు సభ్యులను అభినందించారు.





# తెలంగాణ రైతాంగం జీవనాడి ఎస్సారెస్పీ: ఉత్తమ్ కుమార్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి**

ప్రాజెక్టులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. దాదాపు 56 ఏళ్లుగా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్న ఎస్సారెస్పీ రాష్ట్రానికి గర్వకారణమని అన్నారు. ప్రాజెక్టులో పూడిక పేరుకుపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతోందని గుర్తించి పూడికతీతకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రస్తుత నీటి లభ్యత, వర్షపాతం పరిస్థితులను సమీక్షించిన అనంతరం రానున్న రెండు రోజుల్లో సాగునీటి విడుదలపై నిర్ణయం ప్రకటిస్తామని చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం నీటి నిల్వలు కొంత తక్కువగా ఉన్నందున రైతులు పరిస్థితిని అర్థం చేసుకుని సహకరించాలని కోరారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల విషయంలో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. సాంకేతిక లోపాలు, నిర్మాణ సమస్యల కారణంగా దెబ్బతిన్న ఈ బ్యారేజీల పునరుద్ధరణకు ప్రభుత్వం శాస్త్రీయ విధానంలో చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ ప్రక్రియకు కేంద్ర జల సంఘం ఆమోదం కూడా లభించిందని, పనులను పూర్తి చేసి మళ్లీ వినియోగంలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించబడిందని, దానిని కూడా బీఆర్ఎస్ తమ ఘనతగా ప్రచారం చేసుకోవడం సరికాదని మంత్రి విమర్శించారు. కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టులు దశాబ్దాలుగా సమర్థంగా పనిచేస్తుండగా, ఇటీవల నిర్మించిన కొన్ని ప్రాజెక్టుల్లో నిర్మాణ లోపాలు బయటపడిన విషయాన్ని ప్రజలు గమనించాలని అన్నారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు దక్షిణ తెలంగాణలోని సాగునీటి పరిస్థితిని కూడా ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నాగార్జునసాగర్‌కు ఎగువ ప్రాంతాల నుంచి నీటి ప్రవాహం పెరిగే అవకాశాలు ఉన్నాయని, రాష్ట్రంలో ఎక్కడా రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

## ఉత్తర తెలంగాణ రైతులకు
# సాగునీరే లక్ష్యం: ఉత్తమ్

**పెద్దపల్లి, ఆగస్టు 1**

ఉత్తర తెలంగాణ రైతులకు గరిష్ట స్థాయిలో సాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు వివిధ ప్రాజెక్టుల వద్ద నీటి లభ్యత, ప్రవాహ పరిస్థితులపై సమగ్రంగా అధ్యయనం చేస్తున్నామని చెప్పారు.

అంతర్గాం మండలంలోని ఎల్లంపల్లి రిజర్వాయర్‌ను మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ప్రాజెక్టులో నీటి నిల్వలు, సాగునీటి పంపిణీ పరిస్థితులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

శ్రీరాంసాగర్, కడెం, ఎల్లంపల్లి వంటి ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ప్రారంభమై రైతులకు ఉపయోగపడుతున్నాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 2004లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేశారని, నిర్మాణంలో ఎక్కువ భాగం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయిందని పేర్కొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలు దెబ్బతిన్నాయని, వాటిలో నీటి నిల్వకు జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ సూచనలు ఇచ్చిందని మంత్రి తెలిపారు. గోదావరి జలాలను రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా వినియోగించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు.

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, శ్రీరాంసాగర్, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టుల నీటి పరిస్థితిని పరిశీలిస్తున్నామని తెలిపారు. వర్షాలతో ప్రాజెక్టుల్లో నీటి లభ్యత మెరుగుపడుతోందని, రైతులకు ఎప్పటికప్పుడు పరిస్థితులను తెలియజేస్తూ అవసరమైన సూచనలు అందిస్తున్నామని చెప్పారు.

మంత్రి వివేక్ వెంకటస్వామి కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నాణ్యతపై విమర్శలు చేశారు. నీటిపారుదల రంగంలో గతంలో తీసుకున్న కొన్ని నిర్ణయాల వల్ల ప్రజాధనం వృథా అయిందని ఆరోపించారు. ఈ సందర్భంగా ఎల్లంపల్లి రిజర్వాయర్ ప్రస్తుత పరిస్థితి, నీటి నిల్వలు, సాగునీటి పంపిణీపై అధికారులు మంత్రులకు వివరించారు.

## ధరణి నుంచి భూ భారతి వరకు 'సెట్' విచారణ..

**హైదరాబాద్, ఆగస్టు 1**

రాష్ట్రంలో ధరణి పోర్టల్ నుంచి భూ భారతి వరకు జరిగిన భూ లావాదేవీలు, అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సెట్) విచారణ కొనసాగిస్తోందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్, అసైన్డ్ భూముల కేటాయింపుల్లో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపించిన ఆయన, పూర్తి వివరాలను సేకరించి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మంత్రి మాట్లాడుతూ ధరణి మొదటి టెండర్ నుంచి భూ భారతి వరకు జరిగిన వ్యవహారాలను సెట్ పరిశీలిస్తుందని తెలిపారు. భూ భారతి వ్యవస్థను కేవలం జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ)కే అప్పగించామని, ఆ సంస్థ ఇతరులకు సేవలు అప్పగించిన అంశంతో ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఫోరెన్సిక్ ఆడిట్‌లో అన్ని వివరాలు వెలుగులోకి రాకపోవడంతోనే ప్రత్యేక దర్యాప్తు అవసరమైందన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ, నిషేధిత జాబితాల అంశాలపై కూడా సెట్ పూర్తి వివరాలను సేకరిస్తుందని మంత్రి తెలిపారు.

# మీ సేవ సరికొత్త రికార్డు..

- **ఒక్కరోజే 2.20 లక్షల లావాదేవీలు**
- **జూలై 31న అత్యధిక రోజువారీ లావాదేవీల నమోదు**
- **కుటుంబ కార్డులు, రవాణా సేవలకు భారీ స్పందన**
- **సాంకేతిక అంతరాయాలు లేకుండా సేవలందించిన వ్యవస్థ**
- **డిజిటల్ పాలనలో తెలంగాణ ముందంజలో ఉందన్న శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, ఆగస్టు 1:**

తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ పౌర సేవల వేదిక 'మీ సేవ' కొత్త రికార్డు సృష్టించింది. జూలై 31న ఒక్కరోజే 2,20,172 లావాదేవీలు నమోదై మీ సేవ ప్రారంభమైనప్పటి నుంచి అత్యధిక రోజువారీ లావాదేవీలుగా నిలిచాయని రాష్ట్ర సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మీ సేవ వేదికను నిరంతరం బలోపేతం చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. సేవల విస్తరణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచడం, కొత్త సేవలను అనుసంధానం చేయడం వల్ల ఈ ఘనత సాధ్యమైందని వివరించారు. సాధారణంగా రోజుకు 70 వేల నుంచి 80 వేల వరకు లావాదేవీలు నమోదయ్యే మీ సేవలో ఒకే రోజులో 2.20 లక్షలకు పైగా సేవలు అందించడం డిజిటల్ పాలనపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని శ్రీధర్ బాబు అన్నారు. ఆ రోజు కుటుంబ కార్డు దరఖాస్తులు, రవాణా శాఖ సేవలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం అత్యధికంగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇంత భారీ స్థాయిలో లావాదేవీలు జరిగినప్పటికీ ఎలాంటి సాంకేతిక



అంతరాయం లేకుండా సేవలు అందించగలిగామని మంత్రి చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పనిచేసిన మీ సేవ కేంద్రాల నిర్వాహకులు, వివిధ శాఖల అధికారులు, సాంకేతిక బృందాలను ఆయన అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ప్రజా సేవలను మీ సేవ వేదిక ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చి తెలంగాణను డిజిటల్ పాలనలో దేశానికే ఆదర్శంగా నిలబెడతామని స్పష్టం చేశారు.

## పదవుల పండుగ..
# నామినేటెడ్ పోస్టుల భర్తీకి శ్రీకారం

- **జిల్లాల్లో నేడు ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేల సమావేశాలు**
- **ఆశావాహుల పేర్ల ఖరారు చేసి పార్టీకి జాబితాల పంపిణీ**
- **కార్పొరేషన్లు, బోర్డులు, సహకార సంస్థల్లో దశలవారీగా నియామకాలు**
- **పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యం: తుమ్మల**

**హైదరాబాద్, ఆగస్టు 1**



రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మార్గదర్శకాలకు అనుగుణంగా నియామకాలు చేపడుతున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా ఆదివారం అన్ని జిల్లాల్లో ఇన్‌చార్జి మంత్రుల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించాలని సూచించారు.

ఈ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ ఇన్‌చార్జిలు పాల్గొని నామినేటెడ్ పోస్టులకు అర్హులైన ఆశావాహుల పేర్లను చర్చించి ఖరారు చేయాలని మంత్రి ఆదేశించారు. జిల్లాల నుంచి సమన్వయంతో రూపొందించిన ప్రతిపాదనలను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి పంపాలని సూచించారు. రాష్ట్రంలోని కార్పొరేషన్ చైర్మన్ పదవులు, వివిధ బోర్డులు, నామినేటెడ్ పోస్టులు, సహకార సంఘాలు, డైరెక్టర్ల ఖాళీలను దశలవారీగా భర్తీ చేయనున్నట్లు తుమ్మల వెల్లడించారు. అన్ని నియామకాలు పార్టీ నాయకత్వం నిర్ణయాలకు అనుగుణంగానే ఉంటాయని స్పష్టం చేశారు.

నియామక ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేస్తామని మంత్రి తెలిపారు. జిల్లాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించిన తర్వాత పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు లభించేలా నియామకాలు చేపడుతున్నామని, త్వరలోనే వివిధ కార్పొరేషన్లు, బోర్డులు, సహకార సంస్థల్లో ఖాళీల భర్తీ పూర్తి చేస్తామని పేర్కొన్నారు

# గోదావరి ఉద్ధృతిపై అప్రమత్తం..

- **ముంపు ప్రాంతాల్లో మంత్రి సీతక్క పర్యటన**
- **భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగింపు**
- **పునరావాస కేంద్రాల్లో బాధితులతో మాట్లాడిన మంత్రి**
- **సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం**

**ములుగు, ఆగస్టు 1**



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గోదావరి నదిలో వరద ఉద్ధృతి పెరగడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్న నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ములుగు జిల్లా మంగపేట మండలంలో పర్యటించి వరద పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. మంగపేట మండల కేంద్రానికి చేరుకున్న మంత్రి గోదావరి ప్రవాహం, కరకట్ట పనుల పురోగతిని సమీక్షించారు. లోతట్టు ప్రాంతాల్లో ముంపు పరిస్థితులు, గ్రామాల పరిస్థితిపై రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి తాజా వివరాలు తెలుసుకున్నారు. మండలంలోని పొద్మూరు, ముస్లిం వాడ, బీసీ కాలనీ ప్రాంతాల నుంచి తరలించిన బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను మంత్రి సందర్శించారు. అక్కడ ఉన్న నిర్వాసితులతో మాట్లాడి వారికి అందుతున్న ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, వసతి ఏర్పాట్లపై ఆరా తీశారు. అవసరమైన సౌకర్యాల్లో ఎలాంటి లోటు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గోదావరి వరద ఉద్ధృతి తగ్గే వరకు సంబంధిత శాఖల అధికారులు ఎవరూ ప్రధాన కార్యాలయాలను విడిచి వెళ్లకుండా అందుబాటులో ఉండాలని సీతక్క స్పష్టం చేశారు. సహాయక చర్యలను మరింత వేగవంతం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని ముంపు గ్రామాల పరిస్థితిపై తహసీల్దార్ తోట రవీందర్, ఎస్సై టీవీఆర్ సూరి, ఎంపీడీవో భద్రులు మంత్రికి వివరించారు.

## దక్షిణ మండలి సమావేశానికి
# తెలంగాణ అజెండాపై కసరత్తు

- **రాష్ట్ర ప్రయోజనాల అంశాలపై శాఖల వారీగా సమీక్ష**
- **పెండింగ్ సమస్యలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశం**
- **ప్రతిపాదనలను సీఎం పరిశీలనకు పంపాలని సూచన**
- **అంతర్రాష్ట్ర అంశాలపై ప్రత్యేక దృష్టి**

**హైదరాబాద్, ఆగస్టు 1**



ఈ నెల 20న తమిళనాడులోని మహాబలిపురంలో జరగనున్న దక్షిణ మండలి సమావేశానికి తెలంగాణ తరపున ప్రస్తావించాల్సిన అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. సమావేశ అజెండా, ప్రతిపాదనల రూపకల్పనపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. దక్షిణ మండలి సమావేశంలో తెలంగాణకు సంబంధించిన అంశాలను అన్ని శాఖలు క్షుణ్ణంగా పరిశీలించి, రాష్ట్ర ప్రయోజనాలను ప్రతిబింబించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. వివిధ శాఖల పరిధిలోని కీలక అంశాలు, పెండింగ్ సమస్యలపై సమగ్ర వివరాలను సేకరించాలని ఆదేశించారు. అంతర్రాష్ట్ర సమస్యలు, ప్రాంతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలను ప్రణాళిక శాఖ గుర్తించి సమావేశంలో ప్రస్తావించేలా చర్యలు తీసుకోవాలని సంజయ్ జాజు తెలిపారు. ఆయా శాఖలు వెంటనే స్పందించి, రెండు రోజుల్లో పూర్తి స్థాయి నివేదికలను సిద్ధం చేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో రూపొందించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి పరిశీలనకు పంపించాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. సమావేశంలో తెలంగాణ తరపున అందించే సూచనలు, సిఫార్సులు రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా ఉండేలా అధికారులు సమష్టిగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో వికాస్ రాజ్, సభ్యసాచి ఘోష్, గౌరవ్ ఉప్పల్, ఈ. శ్రీధర్, క్రిస్టినా జోంగ్తు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 7,437 పోలీస్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్..
# ఆగస్టు 19 నుంచి దరఖాస్తులు

- **పోలీస్, ఎస్పీఎఫ్, ఫైర్ సర్వీసెస్, జైళ్ల శాఖల్లో ఖాళీల భర్తీ**
- **సెప్టెంబర్ 9 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ**
- **ప్రిలిమ్స్, శారీరక పరీక్షలు, తుది రాత పరీక్షతో ఎంపిక**
- **అన్ని దశల్లో బయోమెట్రిక్ నమోదు తప్పనిసరి**

**హైదరాబాద్, ఆగస్టు 1**




తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు రాష్ట్రంలోని పోలీస్, ఎస్పీఎఫ్, అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి దరఖాస్తుల షెడ్యూల్‌ను ప్రకటించింది. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆగస్టు 19 ఉదయం 8 గంటల నుంచి సెప్టెంబర్ 9 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బోర్డు సూచించింది.

అభ్యర్థులు దరఖాస్తులను బోర్డు అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే సమర్పించాల్సి ఉంటుంది. ఇతర మార్గాల్లో పంపే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేసింది. దరఖాస్తు రుసుముతో పాటు పరీక్షల నిర్వహణ, బయోమెట్రిక్ నమోదు, సాంకేతిక సేవలు, ఫలితాల ప్రక్రియకు సంబంధించిన ఖర్చులను కలిపి ఒకేసారి ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. నియామక ప్రక్రియలో మొదట ప్రాథమిక రాత పరీక్ష నిర్వహించనున్నారు. కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి పోస్టులకు మూడు గంటల పాటు ఈ పరీక్ష జరగనుండగా, సాంకేతిక పోస్టులకు ప్రిలిమినరీ పరీక్ష ఉండదు. ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు శారీరక కొలతలు, శారీరక సామర్థ్య పరీక్షలు ఆధునిక డిజిటల్ పరికరాల సహాయంతో నిర్వహించనున్నారు. ఎస్సీటీ కానిస్టేబుల్ మెకానిక్, డ్రైవర్ పోస్టులకు శారీరక పరీక్షల అనంతరం ట్రేడ్ లేదా డ్రైవింగ్ పరీక్ష నిర్వహిస్తారు. చివరి దశలో తుది రాత పరీక్ష ఉంటుంది. కానిస్టేబుల్ పోస్టులకు ఒకే పరీక్ష నిర్వహించగా, సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు వివరణాత్మక పత్రాలతో కలిపి మొత్తం నాలుగు పరీక్షలు నిర్వహించనున్నారు. నియామక ప్రక్రియలో ప్రతి దశలో అభ్యర్థుల బయోమెట్రిక్ నమోదు తప్పనిసరిగా ఉంటుందని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు స్పష్టం చేసింది.

## గర్భిణీ స్త్రీలు పాలిచ్చే తల్లులు జాగ్రత్తగా ఉండాలి

### డి డబ్ల్యు ఓ ప్రేమలత



**ములుగు, ఆగస్టు 1, డీ డీ 9 వార్త :**

గర్భిణీ స్త్రీలు పాలిచ్చే తల్లులు జాగ్రత్తగా ఉండాలని ములుగు డి డబ్ల్యూ ఓ ప్రేమలత అన్నారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవి పేట అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆమె హాజరై య్యారు. ఈ సందర్భంగా ప్రేమలత మాట్లాడుతూ పాలిచ్చే తల్లులు తమ శిశువులను జాగ్రత్తగా చూసుకోవాలని అన్నారు. గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు తమ పిల్లలను ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాగా ఈ సందర్భాన్ని పురస్కరించుకొని డిడబ్ల్యుఓ మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుండి ఆరు సంవత్సరాల లోపు పిల్లలు ఎలా డెవలప్ మెంట్ జరుగుతుందో వివరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ శిరీష మహిళా సాధికారిక కేంద్రం నుండి జెండర్ స్పెషలిస్ట్ స్వప్న బి శిరీష లు పాల్గొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బి డబ్ల్యు ఓ అంగన్వాడీ టీచర్ మధ్యలో సంధ్య, ఆయా గోగు స్వరూప లను అభినందించారు.

## బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలు రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనం..!

### తురక రామకోటి - బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, ఉద్యమ నేత.

**మణుగూరు.ఆగస్టు 1 (డి డి 9వార్త)**



బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి రేగా కాంతారావు గారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేయడం బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారి రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనం అని తెలంగాణ ఉద్యమ నేత, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తురక రామకోటి అన్నారు. సంబంధిత మహిళ మీడియా ముందు తనకు రేగా కాంతారావు గారితో ఎలాంటి సంబంధం లేదని, ఆయన ఎవరో కూడా తెలియదని చెప్పిన విషయం ప్రజలందరికీ తెలిసిందే. అలాంటి పరిస్థితిలోనూ అదే ఆరోపణలను పదేపదే ప్రచారం చేస్తూ ఒక గిరిజన నాయకుడి వ్యక్తిత్వాన్ని దెబ్బతీయాలని ప్రయత్నించడం అత్యంత దురదృష్టకరం అని ఆయన పేర్కొన్నారు. బీజేపీ నాయకులు ముందుగా తమ పార్టీ వైపు కూడా చూసుకోవాలి. గతంలో తమ పార్టీ నాయకులు లేదా వారి కుటుంబ సభ్యులపై ఆరోపణలు వచ్చినప్పుడు ఇదే నైతికతను పాటించారా? అదే ప్రమాణాలతో వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారా? లేక ప్రతిపక్ష నేతల విషయంలో మాత్రమే నైతిక విలువలు గుర్తుకు వస్తాయా? అని అన్నారు. చట్టం తన పని తాను చేసుకుంటుంది. దర్యాప్తు పూర్తికాకముందే ఎవరినైనా దోషిగా చిత్రీకరించే ప్రయత్నాలు రాజకీయ కక్ష సాధింపే తప్ప మరొకటి కావు. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారు. అబద్ధపు ప్రచారాలతో ప్రజలను ఎంతకాలం మభ్యపెట్టాలనుకున్నా, చివరికి నిజమే గెలుస్తుంది. నిజానిజాలు పూర్తిగా తెలుసుకోకుండా, విచారణ పూర్తికాకముందే ఇలాంటి ఆరోపణలు చేస్తూ ఒక గిరిజన నాయకుడి గౌరవాన్ని దెబ్బతీయడం బాధ్యతాయుతమైన రాజకీయాలకు తగదు. ఇటువంటి రాజకీయ వ్యాఖ్యలను బీఆర్ఎస్ పార్టీ నాయకులుగా మేము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన తెలిపారు.

## గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలో భాగంగా కాటాపురం గ్రామంలో గ్రామ సభ నిర్వహణ




**తాడ్వాయి (డిడి9 వార్త)**

గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (GPDP)లో భాగంగా కాటాపురం గ్రామంలో గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాటాపురం గ్రామ సర్పంచ్ దిడ్డి మోహన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ గ్రామ సభ యొక్క ముఖ్య ఉద్దేశ్యాన్ని గ్రామ ప్రజలకు వివరించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులను ప్రజల సూచనలు, అభిప్రాయాల ఆధారంగా ప్రణాళికలో చేర్చనున్నట్లు తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్యుత్, విద్య, ఆరోగ్యం తదితర అంశాలపై గ్రామ ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, గ్రామ సభలకు అధిక సంఖ్యలో హాజరై తమ విలువైన సూచనలు అందించాలని సర్పంచ్ దిడ్డి మోహన్ రావు కోరారు.

## ఇకపై యాప్ ద్వారానే ఎరువుల విక్రయాలు: సాలూర ఏవో శ్వేత

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు01 (డీడీ9 వార్త) :**

సాలూర మండల పరిధిలోని రైతులకు ఎరువుల అందజేత ప్రక్రియలో వ్యవసాయ శాఖ కీలక మార్పులు చేపట్టింది. ఇకపై ప్రతి రకం ఎరువుల కొనుగోలును డిజిటలైజ్ చేస్తూ, ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా మాత్రమే విక్రయాలు జరపాలని నిర్ణయించినట్లు మండల వ్యవసాయాధికారి శ్వేత ఒక ప్రకటనలో వెల్లడించారు. గతంలో కేవలం యూరియా కొనుగోలుకు మాత్రమే వినియోగించిన యాప్ విధానాన్ని, రాబోయే రెండు మూడు రోజుల్లో డీఏపీతో పాటు 19:19:19, 12:32:16, 20:20:0:13 వంటి అన్ని కాంప్లెక్స్ ఎరువుల విక్రయాలకు విస్తరించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ నూతన విధానం పూర్తి స్థాయిలో అమలులోకి వచ్చాక సాంకేతిక మార్పుల వల్ల కొనుగోలు సమయంలో విక్రయ కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు గానీ, అవాంతరాలు గానీ తలెత్తకుండా ఉండాలంటే, రైతులు ముందస్తు జాగ్రత్తగా రాబోయే మూడు రోజుల్లోనే తమకు కావలసిన ఎరువుల అవసరాలను తీర్చుకోవాలని సూచించారు.

## ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

### అఖిలపక్ష పార్టీలు, ఆదివాసీ కుల సంఘాల పిలుపు.

**గుండాల ఆగస్టు (డిడి 9వార్త).**



గుండాల మండల కేంద్రంలో ఆగస్టు 9న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా, జయప్రదంగా నిర్వహించాలని అఖిలపక్ష పార్టీలు, ఆదివాసీ కుల సంఘాల ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలిండియా ట్రైబల్ ఫోరం (ఏఐటీఎఫ్) జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం, ఆదివాసీ సంక్షేమ పరిషత్ (ఏఎస్పీ) జిల్లా అధ్యక్షులు వాగబోయిన చంద్రయ్య దొర మాట్లాడుతూ, 1982 ఆగస్టు 9న జెనీవాలో ఐక్యరాజ్యసమితి (UN) ఆధ్వర్యంలో ఆదివాసీల హక్కులపై జరిగిన తొలి కార్యవర్గ సమావేశానికి గుర్తుగా 1994 నుంచి ప్రతి సంవత్సరం ఆగస్టు 9ను ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆగస్టు 9న మండల కేంద్రంలో నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ఆదివాసీ ప్రజలు, యువత, విద్యార్థులు, మహిళలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల రక్షణ కోసం అమలులో ఉన్న 1/70 చట్టం, పీసా (PESA) చట్టంలను సమర్థవంతంగా అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. హరితహారం, ఓపెన్‌కాస్ట్ గనుల పేరుతో ఏజెన్సీ ప్రాంతాల్లో అనేక మంది ఆదివాసీల భూములను తగిన పరిహారం లేకుండానే స్వాధీనం చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే జీవో నెంబర్–3 ద్వారా అనేక మంది ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయని, ఆ జీవోను రద్దు చేయడం వల్ల ఆదివాసీ యువత తీవ్రంగా నష్టపోయిందని పేర్కొన్నారు. ఆదివాసీల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏలలో కూడా గిరిజనేతరుల పెత్తనం కొనసాగుతోందని ఆరోపించారు. ఆదివాసీల అస్తిత్వం, రాజ్యాంగబద్ధమైన హక్కులు, చట్టాలను కాపాడుకోవడానికి కొమరం భీమ్ స్ఫూర్తితో ఆదివాసీ ప్రజలు, విద్యార్థులు, యువత, మేధావులు ఐక్యంగా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అఖిలపక్ష నాయకులు, ఆదివాసీ కుల సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మగాని లచ్చి బాబు గారిని పరామర్శించిన అశ్వారావుపేట BRS నాయకులు..

### రూ.5,000 ఆర్థిక సహాయం...

**అశ్వరావుపేట:ఆగస్టు01 (డిడి 9 వార్త)**



అశ్వారావుపేట నియోజకవర్గం అచ్యుతాపురం గ్రామానికి చెందిన శ్రీ బొమ్మగాని లచ్చి బాబు గారు హార్ట్ సమీపంలో ట్యూమర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న అశ్వారావుపేట BRS నాయకులు ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ పండ్లు, బ్రెడ్ అందజేయడంతో పాటు రూ.5,000 నగదు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ డా. ఉదయ జ్యోతి , డా. ప్రసాద్ , కాసాని చంద్రమోహన్ , కాసాని పద్మ , అశ్వారావుపేట మాజీ టౌన్ ప్రెసిడెంట్ సంపూర్ణ , జజ్జురపు శ్రీరామమూర్తి, అచ్యుతాపురం ఉప సర్పంచ్ పాకనాటి నాగేశ్వరరావు , తగరం జగన్నాథం (మాజీ ఉప సర్పంచ్ పేరాయిగూడెం),సొసైటీ డైరెక్టర్ తెల్లమేకల కన్నయ్య , మాజీ సర్పంచ్ బెల్లం గణేష్, అచ్యుతాపురం BRS నాయకులు సంతపూరి కొండ , తెల్లమేకల మారేషు, ఎర్రగోర్ల ఆది, నక్కా చిరంజీవి, కొనకళ్ళ చిన్నారావు, వార్డు మెంబర్ కోటమర్తి అప్పారావు, వార్డు మెంబర్ కాసిన చిన్ననాయుడు, 10వ వార్డు మెంబర్ నారం రామకృష్ణ , రాంబాబు గారు, కొనకళ్ళ గంగాధర్, పెంటపాటి సతీష్ (సర్పంచ్ అభ్యర్థి), జూపల్లి భుజంధర్, వేదాంతపురం మాజీ సర్పంచ్ ప్రసాద్, ఆరేపల్లి గోవింద్, మాటూరి మోహన్, పాలవలస జీవనరావు, తగరం హరి, శ్రీను , ఉప సర్పంచ్ సంగీత వీరరాజు, రాజనాల గంగాధర్, పండు, శివ, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## చేనేత కార్మికులు, సహకార సంఘాల సమస్యల పరిష్కారానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కు..





- **ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యసాచి ఘోష్‌కు వినతిపత్రం సమర్పించిన పద్మశాలి సంఘం నేతలు.**

**మణుగూరు. ఆగస్టు 1(డి డి 9వార్త)**



తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం

To
Sri Thummala Nageswara Rao Garu,
The Hon'ble Minister for Agriculture, Handlooms & Textiles,
Government of Telangana,
Dr.B.R.Ambedkar Telangana Secretariat,
Hyderabad.

Respected Sir,

We most humbly bring to your kind notice the following grievances related to the welfare and development of Weavers community in Telangana State, for the favour of your kind consideration and favourable orders at an early date please.

1. The government's share of funds pending for 14 months under the Thrift Fund scheme should be released immediately.
2. The second instalment of Nethanna Bharosa funds should be released without delay.
3. The insurance claims of handloom workers above 60 years of age who have passed away, which are still pending, should be settled immediately.
4. The cash credit dues of Handloom Cooperative Societies should be waived.
5. The Government should procure the unsold handloom stock lying with Handloom Cooperative Societies.
6. Individual loans should be provided to handloom workers through banks.
7. Pending Geo-Tag approvals should be sanctioned immediately.
8. Every handloom worker above 50 years of age who possesses a Geo-Tag should be provided a pension. Individuals should be treated as separate units, rather than families, for the purpose of granting handloom pensions.

....2

చేనేత కార్మికులు మరియు చేనేత సహకార సంఘాలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం, అఖిల భారత పద్మశాలి సంఘాల ప్రతినిధులు శనివారం వ్యవసాయ, చేనేత–జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన నివాసంలో, అలాగే చేనేత–జౌళి శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యసాచి ఘోష్‌ను సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు చేనేత రంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి మరియు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రతిపాదించిన ప్రతి అంశాన్ని సంబంధిత అధికారులతో సమీక్షించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కార చర్యలు చేపట్టి నిధుల విడుదలకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

వినతిపత్రంలో ప్రధానంగా 14 నెలల థ్రిఫ్ట్ ఫండ్ ప్రభుత్వ వాటా నిధుల విడుదల, నేతన్న భరోసా రెండో విడత నిధుల మంజూరు, 2026–27 సంవత్సరానికి సంబంధించిన ఉత్పత్తి కార్యక్రమాల తక్షణ జారీ, 60 సంవత్సరాల పైబడిన మరణించిన చేనేత కార్మికుల భీమా బకాయిల చెల్లింపు, సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాల మాఫీ, నిల్వలో ఉన్న చేనేత వస్త్రాల కొనుగోలు, వ్యక్తిగత రుణాల మంజూరు, పెండింగ్ జియో ట్యాగ్ తక్షణమే మంజూరు చేయాలి, చేనేత కార్మికులకు వ్యక్తిగత రుణాలు మంజూరు చేయాలి. 50 సంవత్సరాల నుండి జియో ట్యాగ్ కలిగిన ప్రతి చేనేత కార్మికునికి కుటుంబాన్ని యూనిట్ గా కాకుండా వ్యక్తిని యూనిట్ గా తీసుకొని పెన్షన్ లు మంజూరు చేయాలని కోరారు , అర్హులందరికీ చేనేత గుర్తింపు కార్డుల జారీ చేయాలని కోరారు, ముద్రా రుణాల సబ్సిడీని 50 శాతానికి పెంపు, గ్రామసభల్లో సహకార సంఘాల అధ్యక్షులకు ప్రాధాన్యత కల్పించడం వంటి అంశాలను ప్రస్తావించారు.అదేవిధంగా నూతనంగా ఎన్నికైన సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ మంజూరు చేయడం, ప్రభుత్వ వస్త్రాల కొనుగోలుపై గతంలో అమలులో ఉన్న 20 శాతం రిబేట్ పథకాన్ని పునరుద్ధరించడం, చేనేత ముడిసరుకులు మరియు వస్త్రాలపై జీఎస్టీ తొలగించడం, టెస్కో బకాయిలను వెంటనే చెల్లించడం, వివిధ సంక్షేమ శాఖలకు సరఫరా చేసిన వస్త్రాలకు సంబంధించిన సుమారు రూ.500–600 కోట్ల పెండింగ్ బిల్లులను విడుదల చేయడం, పావలా వడ్డీ పథకం కింద రెండున్నర సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న చెల్లింపులను వెంటనే మంజూరు చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి, అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి, ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, టీపీపీఎస్ ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రరావు, అఖిల భారత పద్మశాలి సంఘం యువజన విభాగం జాతీయ ఇంచార్జ్ అవ్వారి భాస్కర్, టీపీపీఎస్ చేనేత విభాగం అధ్యక్షులు కందగట్ల బిక్షపతి, గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు కత్తుల సుదర్శన్, వెల్లంకి చేనేత సహకార సంఘం అధ్యక్షులు మిర్యాల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబులను కలిసిన సీపీ సాయిచైతన్య

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు01 (డీడీ9 వార్త) :**

నిజామాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రులను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య మర్యాదపూర్వకంగా కలిశారు. పోచంపాడ్ వద్ద గల శ్రీరాంసాగర్ ప్రాజెక్టును పరిశీలించేందుకు వచ్చిన రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబులకు సీపీ పువ్వుల మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. మంత్రుల పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పగడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు పోలీస్ అధికారులు తెలిపారు.



# వరద ముంపు గ్రామాలను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..





- సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం..

**మణుగూరు.ఆగస్టు 1(డి డి 9వార్త)**

గోదావరి వరదలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో బూర్గంపాడు మండలంలోని బూర్గంపాడు మరియు సారపాక గ్రామాల్లో నీట మునిగిన ప్రాంతాలను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సందర్శించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. వరదల కారణంగా ఇళ్లలోకి నీరు చేరి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు.వరద ప్రభావిత ప్రజలను తక్షణమే సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించి, వారికి భోజనం, తాగునీరు, వైద్య సేవలు, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర అన్ని మౌలిక సదుపాయాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయ సహకారాలను వేగంగా అందించి, అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశించారు. అలాగే సారపాక గ్రామంలోని వరద ప్రభావిత ప్రాంతాలను కూడా సందర్శించి పరిస్థితిని సమీక్షించి, ప్రజలకు ధైర్యం చెప్పారు. అనంతరం గోదావరి నదిపై ఉన్న వంతెన (బ్రిడ్జి)పై నుంచి వరద ప్రవాహాన్ని పరిశీలించి, సంబంధిత అధికారులతో పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మారెళ్లపాడు పంప్ హౌస్ నిర్మాణ పనులను పరిశీలన

**మణుగూరు. ఆగస్టు 1 (డి డి 9వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం మండలంలోని మారెళ్లపాడు పంప్ హౌస్ వద్ద కొనసాగుతున్న నిర్మాణ పనులను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పంప్ హౌస్ వద్ద జరుగుతున్న పంపుల ఏర్పాటు (Pump Erection) పనుల పురోగతిని పరిశీలించి, పనులు నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్ ప్రతినిధులను ఆదేశించారు.అనంతరం ప్రధాన పంప్ హౌస్‌లో మోటార్ల కప్లింగ్ (Motor Coupling) పనులను పరిశీలించి, సాంకేతిక ప్రమాణాలను పాటిస్తూ ఎలాంటి లోపాలు లేకుండా పనులు చేపట్టాలని సూచించారు. అలాగే ప్రెషర్ మెయిన్ పైప్‌లైన్ ఏర్పాటు (Laying) పనుల పురోగతిని పరిశీలించి, పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ప్రెషర్ మెయిన్ మరియు తుమ్మల చెరువు ఫీడర్ కాలువ కలిసే (Merging Point) ప్రాంతంలో జరుగుతున్న పనులను పరిశీలించి, ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రాజెక్టు పూర్తయితే ఆయకట్టు రైతులకు సాగునీటి అందుబాటు మెరుగుపడి వ్యవసాయానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, ఇంజనీర్లు, కాంట్రాక్టర్ ప్రతినిధులు, మండల అధ్యక్షులు ఓరుగంటి రమేష్ బాబు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ ముస్కాన్'తో 278 మంది చిన్నారులకు రక్షణ







- బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 01 (డీడీ9 వార్త):**

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు పిల్లల భద్రతను పరిరక్షించడమే 'ఆపరేషన్ ముస్కాన్–XII' ప్రధాన లక్ష్యమని అంబర్ కిషోర్ ఝా తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలో పోలీసు శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, కార్మిక శాఖ, విద్యాశాఖ, బాలల సంరక్షణ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ తదితర ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు.

జూలై 1 నుంచి 31 వరకు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో కమిషనరేట్ పరిధిలో మొత్తం 278 మంది బాలబాలికలను గుర్తించి రక్షించినట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో 151 మంది, మంచిర్యాల జిల్లాలో 127 మంది బాలలను రక్షించడంతో పాటు మొత్తం 17 కేసులు నమోదు చేసి 19 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కమిషనర్ పేర్కొన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్నట్లు లేదా తప్పిపోయిన, వదిలివేయబడిన పిల్లల సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్–1098 లేదా డయల్–100కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బాల కార్మికులను నియమించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీల నిరసన

**భద్రాచలం , ఆగస్టు 1 (డిడి9 వార్త)**




విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ఉద్యోగులు చేస్తున్న న్యాయమైన ఆందోళనకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ ఎన్పీడీసీఎల్ ఉద్యోగులంతా శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భద్రాచలం జేఏసీ జిల్లా కన్వీనర్ జీవన్ కుమార్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగులంతా ఏకం కావలసిన సమయం ఆసన్నమైందని అన్నారు. కార్మికులు ఉద్యోగులు ఉద్యోగుల సంఘాలన్నీ ఏకమైనప్పుడే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటు కరిస్తే ఉద్యోగులు మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, అంతా ఒక తాటి పైకి వచ్చి ఉద్యమించి న్యాయమైన హక్కులను పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్తు సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

## రామగుండంలో డిజిటల్ మీడియా జర్నలిస్టుల ఫోరం నూతన కమిటీ ఎన్నిక

- ఏకగ్రీవంగా కొత్త కార్యవర్గం ఎంపిక
- పాత్రికేయుల ఐక్యత, సంక్షేమానికి కృషి చేస్తామని హామీ



**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 01 (డీడీ9 వార్త):**

రామగుండం డిజిటల్ మీడియా జర్నలిస్టుల ఫోరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాత్రికేయుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వృత్తి అభివృద్ధి లక్ష్యంగా నూతన కమిటీ బాధ్యతలు చేపట్టనున్నట్లు సభ్యులు తెలిపారు.

నూతన కమిటీలో అధ్యక్షుడిగా కనుకుంట్ల రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహేందర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా గద్దల అనిల్ కుమార్, పురమల తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా మామిడి స్వామి, కోశాధికారిగా పెగడపల్లి అశోక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గుడిసెల నంబయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ..., రామగుండం ప్రాంతంలోని డిజిటల్ మీడియా జర్నలిస్టుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ, పాత్రికేయుల సమస్యల పరిష్కారం, సంక్షేమం, వృత్తి గౌరవ పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

## ఎన్‌టీపీసీ నుంచి ప్రభుత్వ ఆసుపత్రులకు రెండు అంబులెన్సుల విరాళం

### రూ.43.50 లక్షల విలువైన అంబులెన్సులను ప్రారంభించిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత అత్యవసర వైద్య సేవలకు మరింత బలోపేతం






**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 01 (డీడీ9 వార్త):**

సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ఎన్‌టీపీసీ యాజమాన్యం గోదావరిఖని, పెద్దపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రులకు రూ.43.50 లక్షల విలువైన రెండు అంబులెన్సులను అందజేసింది. ఈ అంబులెన్సులను ఎన్‌టీపీసీ రామగుండం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు, వివిధ విభాగాల అధిపతులు, కార్మిక సంఘాలు, అసోసియేషన్ ప్రతినిధులు, హెచ్ఆర్ బృందం సభ్యులు పాల్గొన్నారు. ఎన్‌టీపీసీ అందజేసిన ఈ అంబులెన్సుల ద్వారా అత్యవసర పరిస్థితుల్లో రోగులను సకాలంలో ఆసుపత్రికి తరలించడం, అత్యవసర వైద్య సేవలు వేగంగా అందించడం, స్పందన సమయాన్ని తగ్గించడం, ప్రభుత్వ ఆసుపత్రుల ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయడం సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజారోగ్య సేవలను మెరుగుపరచడం, స్థానిక సమాజ సంక్షేమానికి తోడ్పడడం పట్ల ఎన్‌టీపీసీ రామగుండం తన నిబద్ధతను మరోసారి చాటుకుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

## నర్మేట్టలో కలెక్టర్ తండ్రి పర్యటన



**జనగామ ఆగస్టు 1(డిడి 9 వార్త )బ్యూరో**

జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తండ్రి బేఖ్య ఝా శనివారం నర్మేట్ట గ్రామాన్ని సందర్శించారు. గ్రామ ఉద్యానవనాన్ని పరిశీలించి మొక్కల సంరక్షణపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సర్పంచ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోపగోని శ్రీధర్ గౌడ్‌తో గ్రామాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ అంశాలపై చర్చించారు. గ్రామంలో చేపడుతున్న పరిశుభ్రత, పచ్చదనం కార్యక్రమాలను ఆయన అభినందించినట్లు సర్పంచ్ తెలిపారు.

# గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో ఉచిత కంటి పరీక్ష శిబిరం

## ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నేత్ర పరీక్షలు – కంటి ఆరోగ్యంపై అవగాహన

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 01 (డీడీ9 వార్త):**





రామగుండం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెండ్స్ ఫౌండేషన్ హెల్పింగ్ హాండ్స్ తెలంగాణ సహకారంతో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవ్య ఐ హాస్పిటల్ వైద్య బృందం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, కంటి సంరక్షణ, చికిత్స, నివారణ చర్యలపై అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా భవ్య ఐ హాస్పిటల్‌కు చెందిన భవ్య మేడమ్ కంటి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సాంబశివరావు మాట్లాడుతూ.... కంటి ప్రాముఖ్యతను వివరించి, విద్యార్థులు కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఫౌండేషన్ సభ్యుడు మీస వికాస్ కంటి చికిత్స, ముందస్తు పరీక్షల అవసరంపై అవగాహన కల్పించగా, ఫౌండేషన్ అధ్యక్షుడు రౌతు గణేష్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ః ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మీస వికాస్, మార్కా ఆశ్రిత్ గౌడ్, వసీం, అశ్వన్, అక్షయ్, విశ్వ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. ఎం. నరేష్, డి. కిరణ్మయి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 60% నామినేటెడ్ పోస్టులు పార్టీ సీనియర్లకే టి పి సి సి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్...

## మాజీ మండల అధ్యక్షులు, జిల్లా నేతలకు నామినేటెడ్ పోస్టుల్లో అధిక ప్రాధాన్యం...

**గాంధీభవన్:ఆగస్టు 01 (డిడి 9 వార్త)**



గాంధీ భవన్ టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తో సమావేశం అయిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్య సభ ఎంపీ వేం నరేందర్ రెడ్డి .. సమావేశంలో రాబోయే వ్యవసాయ పరపతి సహకార సంఘాల (పిఏ సీఎస్) డైరెక్టర్లు, చైర్మన్ లు, పలు. నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టుల భర్తీపై చర్చించి విధి విధానాలు రూపొందించారు. ఉమ్మడి జిల్లాలకు ఉన్న ఇంచార్జ్ మంత్రి జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, నియోజక వర్గంలో పోటీ చేసిన అభ్యర్థులు సీనియర్ నాయకులతో సమావేశం అయ్యి, సమన్వయంతో ఆశావహుల నివేదిక రూపొందించాలని నిర్ణయించారు. ప్రధానంగా 60 శాతం నామినేటెడ్ పోస్టులను గత మండల అధ్యక్షులకు, జిల్లా కార్యవర్గంలో పని చేసిన వారికి, అనుబంధ సంఘాల నాయకులకు, నియోజకవర్గ సీనియర్ నాయకులకు ఇవ్వాలని నిర్ణయించారు. నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, మహిళలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. అన్ని సంప్రదింపులు చేసి తుది జాబితాను సిద్ధం చేశాక, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కలిసి నిర్ణయం తీసుకోవాలని సమావేశం నిర్ణయించింది..

# అదుపుతప్పి కింద పడ్డ ద్విచక్ర వాహనం.. వ్యక్తికి తీవ్ర గాయాలు...

**ఆగస్టు01 డిడి9 వార్త వెంకటాపురం.**



ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాక శివారులో శనివారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అబ్బాయిగూడెం గ్రామానికి చెందిన గగ్గురి ఏసు (50) ద్విచక్ర వాహనంపై అబ్బాయిగూడెం నుంచి ఆలుబాక వైపు వెళ్తుండగా పాత ఆలుబాక సమీపంలో వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయన కంటి పైభాగంలో తీవ్ర గాయమైంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఈఎంటీ రాజ్‌కుమార్, పైలట్ మంచికంటి వెంకటేష్ సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వెంకటాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అక్కడ వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స అవసరమని సూచించడంతో, బాధితుడిని 108 అంబులెన్స్‌లో ములుగు జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# 75 వేల టన్నుల యూరియా ఉత్పత్తి

## తెలంగాణకు అత్యధిక సరఫరా చేసిన ఆర్ఎఫ్‌సీఎల్

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 01 (డీడీ9 వార్త):**




ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం జూలై–2026 నెలకు సంబంధించిన యూరియా ఉత్పత్తి, పంపిణీ వివరాలను విడుదల చేసింది. ఆర్ఎఫ్‌సీఎల్ అనేది నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్, ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్, ఫర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సంయుక్త భాగస్వామ్య సంస్థ. ఇందులో ఎన్ ఎఫ్ ఎల్, ఈ ఐ ఎల్ సంస్థలకు తలా 26 శాతం, ఎఫ్ సి ఐ ఎల్ కు 11 శాతం, తెలంగాణ ప్రభుత్వానికి 11 శాతం ఈక్విటీ వాటా ఉంది. 2021 మార్చి 22న వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించిన రామగుండం యూనిట్‌లో తయారయ్యే నీమ్ కోటెడ్ యూరియాను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. జూలై 2026లో ప్లాంట్‌లో 75,391 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేయగా, 74,858.58 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు యాజమాన్యం తెలిపింది. ఇందులో తెలంగాణకు 31,159.44 మెట్రిక్ టన్నులు, కర్ణాటకకు 24,488.55 మెట్రిక్ టన్నులు, తమిళనాడుకు 13,557.96 మెట్రిక్ టన్నులు, ఆంధ్రప్రదేశ్‌కు 5,652.63 మెట్రిక్ టన్నులు సరఫరా చేశారు. ఏప్రిల్ నుంచి జూలై 2026 వరకు మొత్తం 3,78,143 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేయగా, అందులో 2,07,294.12 మెట్రిక్ టన్నులు తెలంగాణ రాష్ట్రానికే సరఫరా చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆర్ఎఫ్‌సీఎల్ జనరల్ మేనేజర్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ..., సంస్థ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం మరియు సంబంధిత అధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# జెన్‌కోను వేలంపాటలో పాల్గొననివ్వొద్దు..

- పీకే–2 డీప్ సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలి
- సింగరేణి మనుగడ– కార్మికుల ఉపాధి పరిరక్షణే ప్రభుత్వ బాధ్యత
- ఏఐటీయూసీ గుర్తింపు సంఘం డిమాండ్

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 01 (డీడీ9 వార్త):**




తెలంగాణలోని మణుగూరు పీకే–2 డీప్ సైడ్ బ్లాక్‌ను నేరుగా సింగరేణికే కేటాయించాలని, జెన్‌కోను వేలంపాట (ఆక్షన్) ప్రక్రియలో పాల్గొనకుండా రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఏఐటియుసి గుర్తింపు సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖ సింగరేణి కార్మికుల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోందన్నారు. సింగరేణి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. పీకే–2 డీప్ సైడ్ బ్లాక్ సింగరేణి మనుగడకు కీలకమైన బొగ్గు నిల్వల ప్రాంతమని, వేలాది మంది కార్మికుల ఉపాధి, సంస్థ భవిష్యత్తు ఈ బ్లాక్‌పైనే ఆధారపడి ఉందన్నారు. ఈ బ్లాక్‌ను ఇతర సంస్థలకు కేటాయించడం తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు. జెన్‌కో పేరుతో వేలంపాటలో ప్రవేశపెట్టి చివరకు ప్రైవేట్ సంస్థలకు మార్గం సుగమం చేసే ప్రయత్నాలను ఏఐటీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం సింగరేణిని బలోపేతం చేస్తామని చెబుతూనే కీలక బొగ్గు బ్లాక్‌ల విషయంలో అనిశ్చితి సృష్టించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. సింగరేణికి తగినంత బొగ్గు నిల్వలు లేకుంటే ఉత్పత్తి తగ్గి వేలాది మంది కార్మికుల ఉపాధి ప్రమాదంలో పడటంతో పాటు తెలంగాణ ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. "సేవ్ సింగరేణి – సేవ్ మణుగూరు" నినాదంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కే. వెంకటేష్, ఎస్. నర్సింగ్‌రావు, కే. బీరయ్య, ఎ. ప్రభాకర్, ఎం. రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవాసవ్య విద్యాలయంలో ఘనంగా బోనాల వేడుకలు

- అమ్మవారికి బోనం సమర్పించిన బీజేపీ రామగుండం ఇన్ చార్జ్ కందుల సంధ్యారాణి

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 01 (డీడీ9 వార్త):**



గోదావరిఖని రమేష్‌నగర్‌లోని శ్రీ వాసవ్య విద్యాలయంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు...

ఈ కార్యక్రమానికి బీజేపీ రామగుండం ఇన్‌చార్జ్ కందుల సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరై, భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు...

ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో బోనాల శోభాయాత్ర నిర్వహించగా, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి జయజయధ్వానాల మధ్య నిర్వహించిన వేడుకలు భక్తిపారవశ్యాన్ని నింపాయి..

ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ... బోనాలు తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని అన్నారు. ఆషాఢ మాసంలో అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించడం మన పూర్వీకుల నుంచి వస్తున్న గొప్ప సంప్రదాయమని పేర్కొన్నారు. బోనాలు కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా తెలంగాణలోని ప్రతి ప్రాంతంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించబడుతున్నాయని తెలిపారు. పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను కూడా చిన్నప్పటి నుంచే పరిచయం చేయడం ఎంతో అవసరమని అన్నారు. పాఠశాలల్లో ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సంస్కృతి పట్ల గౌరవం, భక్తి, సామాజిక బాధ్యత పెంపొందుతాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యాలయ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు బోనాల పండుగ విశిష్టతను వివరించి, ముఖ్య అతిథిగా విచ్చేసిన కందుల సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రముఖులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# శిథిల భవనాల తొలగింపుపై తహసీల్దార్ తనిఖీలు..

- పాఠశాలల్లో పారిశుద్ధ్య పరిశీలన ...
- విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన తహసీల్దార్..

**హత్నూర, ఆగస్టు 01,(సిరి న్యూస్)**



హత్నూర మండల తహసీల్దార్ ఫర్హీన్ షేక్ శనివారం హత్నూర, దేవులపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పలు అంశాలను పరిశీలించారు. హత్నూర గ్రామంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించిన తహసీల్దార్, శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను పరిశీలించి వాటిని తొలగించే ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ, శానిటేషన్ పరిస్థితులను తనిఖీ చేసి విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తదుపరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అక్కడ అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, అందిస్తున్న ఆహారం నాణ్యత, రుచి, పరిశుభ్రతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటశాల నిర్వహణ, ఆహార పదార్థాల నాణ్యత విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందికి సూచించారు. దేవులపల్లి గ్రామంలోని పాఠశాలను సందర్శించిన అక్కడ కూడా శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను పరిశీలించారు. ప్రమాదకరంగా ఉన్న భవనాలను తొలగించి విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# కాంట్రాక్టర్ నిర్లక్ష్యం...!!

- నరకయాతనలో ఎల్ బీ నగర్ ప్రజలు
- 3 నెలలుగా పూర్తి కాని రోడ్డు పనులు
- పగిలిన డ్రైనేజ్.. నిలిచిన టాయిలెట్ కనెక్షన్
- 5 రోజులుగా నరకయాతనలో మహిళలు, చిన్నారులు
- డ్రైనేజ్ పునరుద్ధరణకు డిమాండ్
- కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోండి
- ఫైన్ వేసి, బ్లాక్ లిస్టులో చేర్చాలని డిమాండ్



**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 01 (డీడీ9 వార్త):**

రామగుండం నగరపాలక సంస్థ 41వ డివిజన్ పరిధి ఎల్‌బీ నగర్, జవహర్ నగర్ ప్రధాన రహదారిపై జరుగుతున్న రోడ్ ఎక్స్టెన్షన్ పనులు ప్రజలకు తీవ్ర ఇబ్బందులను మిగులుస్తున్నాయి. మూడు నెలలు గడిచినా పనులు పూర్తి కాకపోవడంతో స్థానికులు నిత్యం అవస్థలు పడుతున్నారు. అభివృద్ధి పేరుతో ప్రారంభించిన పనులు ఇప్పుడు ప్రజలకు శాపంగా మారాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్ విస్తరణలో భాగంగా డ్రైనేజ్ పైపులను పగలగొట్టిన కాంట్రాక్టర్ వాటిని ఇప్పటికీ పునరుద్ధరించకపోవడం పరిస్థితిని మరింత దయనీయంగా మార్చింది. గత ఐదు రోజులుగా టాయిలెట్ డ్రైనేజ్ కనెక్షన్ పూర్తిగా నిలిచి పోవడంతో అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఇళ్లలో మురుగునీరు నిలిచిపోవడం వల్ల దుర్వాసన వ్యాపించి ఆరోగ్య సమస్యలు తలెత్తే పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు అత్యంత ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు స్నానాలకు, బయటకు వెళ్లడానికి, చిన్న పిల్లలను బయటకు తీసుకెళ్లడం కూడా కష్టంగా మారిందని చెబుతున్నారు. వృద్ధులు ప్రాథమిక అవసరాల కోసం కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ప్రజల బాధలను పట్టించుకోవాల్సిన కాంట్రాక్టర్ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. పనులు ప్రారంభించే ముందు సరైన ప్రణాళిక లేక పోవడమే ఈ దుస్థితికి కారణమని ఆరోపి స్తున్నారు. అధికారులు కూడా పరిస్థితిని పరిశీలించి చర్యలు తీసుకోవడంలో ఆలస్యం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. అభివృద్ధి పనులు ప్రజలకు ఉపయోగ పడాలి గానీ, ఇలాంటి నరకయాతనకు గురి చేయకూడదని స్థానికులు అంటున్నారు. వెంటనే డ్రైనేజ్ వ్యవస్థను పునరుద్ధరించి టాయిలెట్ కనెక్షన్లు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. రోడ్ ఎక్స్టెన్షన్ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరుతున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని, కలెక్టర్, సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల కష్టాలు ఇకనైనా గుర్తించి తక్షణమే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.





## పక్కా వ్యూహంతో రూ.52 కోట్ల మోసాన్ని ఛేదించిన భద్రాద్రి పోలీసులు

- పెట్టుబడుల పేరిట భారీ టోకరా
- రూ.52 కోట్ల కుంభకోణం బట్టబయలు
- కోట్లకు పడగలెత్తిన కేటుగాడు.. కేరళలో అరెస్ట్.
- 35 వాహనాలు స్వాధీనం
- భద్రాచలంలో మూడు అంతస్తుల భవనం, ప్లాట్ గుర్తింపు
- నకిలీ ఒప్పందాలతో పెట్టుబడిదారులకు టోకరా
- పూర్తి మనీ ట్రైల్‌పై పోలీసుల దృష్టి
- అధిక లాభాల పేరుతో పెట్టుబడులు పెట్టొద్దని పోలీసుల హెచ్చరిక



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, ఆగస్టు 1 ( డిడి9 వార్త)**

అధిక లాభాల పేరుతో పెట్టుబడులు సమీకరించి సుమారు రూ.52 కోట్ల మేర ప్రజలను మోసం చేసిన భారీ ఆర్థిక నేరాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు బేతంపూడి భరత్‌కుమార్‌ను కేరళ రాష్ట్రంలోని పాలా ప్రాంతంలో అరెస్టు చేసి ట్రాన్సిట్ వారెంట్‌పై జిల్లాకు తరలించారు. నిందితుడి వద్ద నుంచి నేరార్జిత ఆస్తులుగా భావిస్తున్న 35 వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు భద్రాచలం రాజీవ్‌నగర్‌లోని మూడు అంతస్తుల భవనం, ఒక ప్లాట్‌ను గుర్తించారు. కేసులో పూర్తి మనీ ట్రైల్‌ను వెలికితీసేందుకు ఆర్థిక లావాదేవీలపై పోలీసులు లోతుగా దర్యాప్తు కొనసాగి స్తున్నారు. జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ శనివారం కేసు వివరాలను వెల్లడించారు. లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నెం.134/2026 కేసులో భార్పాటి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సంచలన విషయాలను వెలుగులోకి తెచ్చారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు తాను భద్రాచలం ఐటీసీ పేపర్‌బోర్డ్స్‌లో లేబర్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నానని, తనతో భాగస్వామిగా ఉంటే కాంట్రాక్ట్ పనులు ఇప్పించి అధిక లాభాలు అందిస్తానని నమ్మబలికి పలువురు బాధితుల నుంచి భారీ మొత్తంలో పెట్టుబడులు సేకరించినట్లు తేలింది. బాధితుల విశ్వాసాన్ని పొందేందుకు నకిలీ భాగస్వామ్య ఒప్పందాలు, తప్పుడు పత్రాలు రూపొందించి, లాభాల్లో నాలుగు శాతం వాటా ఇస్తామని హామీ ఇస్తూ సుమారు రూ.52 కోట్ల మేర వసూలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. బీకే నాయుడు అండ్ కో., రాజేశ్వరి ట్రావెల్స్ పేర్లతో సంస్థలను నిర్వహిస్తూ ఈ మోసపూరిత వ్యవహారాన్ని సాగించినట్లు గుర్తించారు. సాంకేతిక ఆధారాలు, బ్యాంకు ఖాతాల విశ్లేషణ, ఆర్థిక లావాదేవీల ఆధారంగా నిందితుడి ఆచూకీని గుర్తించిన పోలీసులు కేరళలోని పాలా ప్రాంతంలో అరెస్టు చేశారు. పోలీసు కస్టడీలో విచారణ సందర్భంగా నిందితుడి నుంచి నేరార్జిత ఆస్తులుగా భావిస్తున్న ఆరు బస్సులు, ఒక వాటర్ ట్యాంకర్ లారీ, మూడు ట్రాక్టర్లు, రెండు వ్యవసాయ పరికరాలు, ఏడు కార్లు, 14 ద్విచక్ర వాహనాలు, రెండు ట్రైలర్లు కలిపి మొత్తం 35 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా మోసపూరితంగా సేకరించిన నిధులతో భద్రాచలం రాజీవ్‌నగర్‌లో మూడు అంతస్తుల భవనం, ఒక ప్లాట్ కొనుగోలు చేసినట్లు గుర్తించారు. కేసులో మరిన్ని బాధితులను గుర్తించడం, నేరార్జిత ఆస్తులను స్వాధీనం చేసుకోవడం, పూర్తి మనీ ట్రైల్‌ను వెలికితీయడం కోసం దర్యాప్తును మరింత విస్తరించినట్లు పోలీసులు తెలిపారు. ప్రజలకు పోలీసుల హెచ్చరిక అధిక లాభాలు, తక్కువ సమయంలో రెట్టింపు రాబడులు వస్తాయంటూ ప్రచారం చేసే వ్యక్తులు లేదా సంస్థలను నమ్మి పెట్టుబడులు పెట్టవద్దని పోలీసులు ప్రజలను అప్రమత్తం చేశారు. అనుమానాస్పద పెట్టుబడి పథకాలపై సమాచారం తెలిసినా, మోసానికి గురైనా వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ భారీ ఆర్థిక మోసం కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన లక్ష్మీదేవిపల్లి పోలీసు సిబ్బంది, జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందాన్ని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు అభినందించారు.

## ఆగస్టు 15 వేడుకల ఘనంగా నిర్వహించాలి





- ప్రభుత్వ పథకాలు సక్రమంగా ప్రజలకు చేరాలంటే అధికారుల పాత్ర చాలా కీలకమైనది – ఎమ్మెల్యే జారె ఆదినారాయణ...

**అశ్వరావుపేట:ఆగస్టు01(డిడి 9వార్త)**

అశ్వారావుపేట నియోజకవర్గ గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అశ్వారావుపేట క్యాంపు కార్యాలయంలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు మరియు అభివృద్ధి పనులపై కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, ఎంఈఓలు, ఫారెస్ట్ అధికారులు, గృహ నిర్మాణ శాఖ అధికారులు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణ ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాలని, నియోజక వర్గంలో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రయోజనార్థం ప్రభుత్వం చేపడుతున్న పనుల్లో ఎలాంటి అలసత్వం వహించ వద్దని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. అనంతరం స్థానిక మినీ స్టేడియంలో ఆగస్టు 15 వేడుకల నిర్వహణ కోసం చేపడుతున్న ఏర్పాట్లను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

## జైల్లో ఖైదీలకు నిబంధనల మేర సౌకర్యాలు కల్పించాలి

- ఉచిత న్యాయ సహాయం అవసరమైన వారిని గుర్తించాలి
- భద్రాచలం సబ్‌జైలును సందర్శించిన జిల్లా షెషన్స్ న్యాయమూర్తి జి. ప్రేమలత



**భద్రాచలం, ఆగస్టు 1 (డిడి9 వార్త)**

జైల్లో ఖైదీలకు ప్రభుత్వ నిబంధనల మేర తగిన విధంగా సౌకర్యాల కల్పించాలని, ఉచిత న్యాయ సహాయం అవసరమైన గుర్తించి తగిన సహాయ సహకారాలు అందించాలని జిల్లా షెషన్స్ న్యాయమూర్తి జి. ప్రేమలత అన్నారు. శనివారం భద్రాచలంలోని ప్రత్యేక సబ్‌జైలును ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా జైల్లో ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలు, మౌలిక, భోజనం వసతులను, ఉచిత న్యాయ సహాయాన్ని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. జైల్లోని ఖైదీలు అగరబత్తి తయారీ విధానాన్ని కొనియాడారు. అంతకు ముందు భద్రాచలం జ్యుడీషియల్ కోర్టును సందర్శించి కోర్టు ఆవరణ, న్యాయస్థానాల పనితీరు, మౌలిక సదుపాయాలు, వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం న్యాయాధికారులు, భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులతో సమావేశమై కోర్టు నిర్వహణ, మౌలిక వసతులు, న్యాయవాదుల అభిప్రాయాలు మరియు కోర్టు అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి కోర్టుకు వచ్చే న్యాయవాదులు, కక్షిదారుల సౌకర్యార్థం కోర్టు ఆవరణలో క్యాంటీన్ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని జిల్లా జడ్జి గారి దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే మానవసేవ వాలంటరీ ఆర్గనైజేషన్ వారి ఓల్డ్ ఏజ్ హోమ్ ను సందర్శించి అక్కడ నివసిస్తున్న వృద్ధులను పలకరించి, వారికి పండ్ల రసాన్ని అందించారు, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు, వృద్ధాశ్రమలో అందిస్తున్న సేవలను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. ఆమె వెంట భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శివ నాయక్, భద్రాచలం అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గా భవాని, భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, జాయింట్ సెక్రెటరీ తాత లలితతో పాటు న్యాయవాదులు ఉన్నారు.

## వర్షా కాలం అప్రమత్తతే ప్రాణ రక్షణ..

### వెంకటాపురం ప్రైవేటు యూనియన్ సంఘం..



**ఆగస్టు01 డిడి9 వార్త వెంకటాపురం.**

ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో శనివారం ప్రైవేట్ ఎలక్ట్రిషన్ యూనియన్ సమావేశం ఘనంగా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు సున్నం రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వర్షాకాలంలో విద్యుత్ పనులు నిర్వహించే సమయంలో ఎలక్ట్రిషన్లు తప్పనిసరిగా పాటించాల్సిన భద్రతా చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సున్నం రమేష్ మాట్లాడుతూ, వర్షాకాలంలో విద్యుత్ పనులు అత్యంత ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున ప్రతి ఎలక్ట్రిషన్ పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. తడి ప్రదేశాలు, వర్షంలో లేదా నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో పని చేసే సమయంలో ఇన్సులేటెడ్ గ్లౌజులు, సేఫ్టీ షూస్, అవసరమైన భద్రతా పరికరాలను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు.

అలాగే, విద్యుత్ పనులు ఒంటరిగా చేయకుండా సాధ్యమైనంత వరకు ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది కలిసి పనిచేయాలని, ప్రమాద పరిస్థితులు తలెత్తిన వెంటనే పరస్పరం సహాయం అందించేలా ఉండాలని తెలిపారు. భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు.

యూనియన్ సభ్యులందరూ ఐకమత్యంతో వ్యవహరిస్తూ, పరస్పరం సహకరించుకుంటూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సభ్యులు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై తమ అభిప్రాయాలను వెల్లడించగా, యూనియన్ నాయకత్వం పలు సూచనలు, సలహాలు అందించింది.

ఈ సమావేశం ద్వారా సభ్యుల్లో భద్రతపై మరింత అవగాహన పెంపొందడంతో పాటు, వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలనే సందేశం స్పష్టంగా వెళ్లిందని సభ్యులు అభిప్రాయపడ్డారు.

## మత్తులో డ్రైవింగ్.. 29 మందికి జైలు శిక్ష

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు01 (డీడీ9 వార్త) :**




రోడ్డు భద్రతపై నిజామాబాద్ కమిషనరేట్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. గత రెండు వారాల్లో డివిజన్ల వారీగా నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 346 మంది డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో చిక్కారు. వీరికి కోర్టులు రూ. 32.60 లక్షల భారీ జరిమానా విధించడమే కాకుండా, 29 మందికి వారం రోజుల జైలు శిక్ష ఖరారు చేశాయి. మద్యం తాగి వాహనం నడిపే వారి పట్ల ఎలాంటి ఉపేక్ష లేదని పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య స్పష్టం చేశారు. ఒక్కసారి కంటే ఎక్కువ సార్లు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే నేరుగా జైలు శిక్ష పడుతుందని కమిషనర్ హెచ్చరించారు. తాగి వాహనం తోలి ప్రమాదానికి గురైతే ఇన్సూరెన్స్ కంపెనీలు పరిహారం చెల్లించవని గుర్తుచేశారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి, వారు తాగి దొరికితే వాహన యజమానులను కూడా నిందితులుగా చేర్చి కటకటాల్లోకి నెడతామన్నారు. కొత్త మోటార్ వెహికల్ చట్టం ప్రకారం మొదటి తప్పునకు రూ. 10 వేలు, రెండోసారి అయితే రూ. 15 వేల జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా ఉంటుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా వాహనాలు నడపాలని విజ్ఞప్తి చేశారు.

## అమాయక యువతిని మోసం చేసిన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై కఠిన చర్యలు తీసుకోవాలి. బీజేపీ గుండాల మండల అధ్యక్షుడు సోలం సతీష్ డిమాండ్.

**గుండాల, ఆగస్టు 1 (డి డి 9 వార్త).**



పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఒక యువతిని మాయమాటలతో నమ్మించి మోసం చేశారంటూ వస్తున్న ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ గుండాల మండల అధ్యక్షుడు సోలం సతీష్ డిమాండ్ చేశారు. శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రజాప్రతినిధిగా, మాజీ ప్రభుత్వ విప్‌గా పనిచేసిన వ్యక్తిపై ఇలాంటి ఆరోపణలు రావడం సమాజానికి, ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. బాధిత యువతికి న్యాయం జరిగేలా ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న రేగా కాంతారావుపై ఆయనకు చెందిన పార్టీ కూడా తగిన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరిగే వరకు పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని బీఆర్ఎస్ నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. మహిళలను గౌరవించే సంస్కృతి ఉన్న దేశంలో మహిళల పట్ల మోసపూరితంగా లేదా అవమానకరంగా వ్యవహరించే వారిపై ఎలాంటి రాజకీయ, సామాజిక హోదా ఉన్నా చట్టం ముందు సమానంగా చర్యలు ఉండాలని సోలం సతీష్ పేర్కొన్నారు. రాష్ట్ర మహిళా సంఘాలు, ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధులు బాధిత యువతి తరఫున నిలబడి ఆమెకు న్యాయం జరిగేలా కృషి చేయాలని ఆయన

## అన్నాభావు సాఠే జయంతి సందర్భంగా ఘన నివాళులు

**డిడి9 వార్త గుడిహత్నూర్:**



మహామానవుడు, సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాఠే జయంతి సందర్భంగా భీమ్ ఆర్మీ, అజాద్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నివాళులర్పించారు. అన్నాభావు సాఠే చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అన్నాభావు సాఠే జీవితం సామాజిక న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతికి అంకితమైందని కొనియాడారు. ఆయన ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని, సమాజంలో సమాన హక్కులు, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భీమ్ ఆర్మీ, అజాద్ సమాజ్ పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీ డీకే అమితోధన్, మండల అధ్యక్షుడు డీకే సునీల్, వైస్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్, జనరల్ సెక్రటరీ కే. మధుకర్, భీమ్ ఆర్మీ, అజాద్ సమాజ్ పార్టీ నాయకులు, సామాజిక కార్యకర్తలు మరియు పలువురు సభ్యులు పాల్గొని అన్నాభావు సాఠేకు ఘనంగా నివాళులర్పించారు<.

## విద్యార్థులను అవమానిస్తే సహించేది లేదు : బీజేవైఎం



**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు01 (డీడీ9 వార్త) :**

ఇంజనీరింగ్ విద్యార్థులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేవైఎం శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. శనివారం ఇందూరు నగరంలోని నిఖిల్ సాయి చౌరస్తా వద్ద బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంశీ గౌడ్ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఫీజు రీయింబర్స్మెంట్ సకాలంలో విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడమే కాకుండా, వారిని కించ పరిచేలా మాట్లాడటం దారుణమని నేతలు మండిపడ్డారు. యువత ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ముఖ్యమంత్రి మాట్లాడటం తగదని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడం మానేసి వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని నాయకులు దుయ్యబట్టారు. సీఎం వెంటనే తన మాటలను ఉపసంహరించుకుని విద్యార్థి లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కో-కోశాధికారి అమంద్ విజయ్ కృష్ణ, జిల్లా నాయకులు రాజ్ గణేష్, ప్రశాంత్, మహేష్ తదితర కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

### 'తపస్' మహాధర్నాకు తరలిన కమ్మర్ పల్లి ఉపాధ్యాయులు

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు01 (డీడీ9 వార్త) :**

ఉపాధ్యాయులు, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం పిలుపుమేరకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన మహాధర్నాకు కమ్మర్‌పల్లి మండల ఉపాధ్యాయులు భారీగా తరలివెళ్లారు. తపస్ మండల అధ్యక్షుడు సల్లూరి కిషన్ గౌడ్ నాయకత్వంలో ఉపాధ్యాయులు ఈ ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 6 కరువు భత్యాల బిల్లులతో పాటు ఈ-కుబేర్‌లో నిలిచిపోయిన ఉపాధ్యాయుల క్లెయిమ్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉపాధ్యాయులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందేలా హెల్త్ కార్డులను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే రాబోయే రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మహాధర్నాలో తపస్ నాయకులు, జె. శంకర్, ఎం. శ్రీనివాస్, రంజిత్, ఎస్. కిషన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి గుప్పిట్లో ఏజెన్సీ







- **ఉగ్ర గోదావరి శాంతిస్తోంది..**
- **భద్రాచలం వద్ద కొనసాగుతున్న మూడో ప్రమాద హెచ్చరిక**
- **విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారి మూసివేత**
- **అస్తవ్యస్తంగా ఏజెన్సీ జనజీవనం**
- **నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు.. అస్తవ్యస్తంగా రవాణా వ్యవస్థ**
- **క్షేత్రస్థాయిలో వరద పరిస్థితులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాచలం, ఆగస్టు 1 (డిడి9 వార్త):**

భద్రాచలం వద్ద గత మూడు రోజులుగా ఏజెన్సీ ప్రాంత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసిన గోదావరి వరద క్రమంగా తగ్గుముఖం పట్టినప్పటికీ, మూడో ప్రమాద హెచ్చరిక మాత్రం కొనసాగుతోంది. వరద ప్రభావంతో విజయవాడ–జగదల్‌పూర్ జాతీయ రహదారిని అధికారులు పూర్తిగా మూసివేయడంతో భద్రాచలం మీదుగా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలకు వెళ్లే లారీలు, ఇతర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. శుక్రవారం అర్ధరాత్రి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 53 అడుగులకు చేరుకోవడంతో సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అనంతరం శనివారం తెల్లవారుజామున నీటిమట్టం క్రమంగా పెరిగి ఉదయం 11 గంటలకు 56.10 అడుగులకు చేరుకొని మధ్యాహ్నం 2 గంటల వరకు నిలకడగా కొనసాగింది. ఆ తర్వాత మధ్యాహ్నం 3 గంటల నుంచి వరద తగ్గుముఖం పట్టి సాయంత్రానికి 55.30 అడుగులకు చేరింది. ప్రస్తుతం భద్రాచలం వద్ద సుమారు 15.53 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదలవుతోంది. గోదావరి 50 అడుగులకు పైగా ప్రవహిస్తుండటంతో బూర్గంపాడు, భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని పలు ఆర్అండ్‌బీ రహదారులపై వరద నీరు పారుతోంది. దీంతో భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి కొత్తగూడెం మార్గం మినహా చర్ల, కుక్కునూరు, కూనవరం, వెంకటాపురం రూట్లలో బస్సు సర్వీసులను నిలిపివేశారు. తూరుబాక, సారపాక, యటపాక ప్రాంతాల్లో రహదారులపై వరద నీరు కొనసాగుతుండటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గోదావరి నీటిమట్టం 45 అడుగులకు తగ్గిన తర్వాతే రవాణా పునరుద్ధరణకు అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

### పోలవరం ప్రభావంతో నెమ్మదిగా తగ్గుతున్న వరద

భద్రాచలం వద్ద వరద ఉధృతి పెరిగిన సమయంలో గోదావరి కేవలం 20 గంటల్లోనే 28 అడుగులు పెరిగినప్పటికీ, ప్రస్తుతం గంటకు ఒక పాయింట్ చొప్పున మాత్రమే తగ్గుతోంది. పోలవరం ప్రాజెక్టు వద్ద నీటి నిల్వ, స్పిల్‌వే ద్వారా దిగువకు నీటి విడుదల కారణంగా ప్రవాహ వేగం తగ్గిందని అధికారులు భావిస్తున్నారు. దీంతో భద్రాచలం వద్ద వరద తగ్గుదల నెమ్మదిగా సాగుతుండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది.

### జాతీయ రహదారిపై మట్టికట్ట.. వాహనాల నిలిపివేత

భద్రాచలంలోని సరస్వతి శిశుమందిర్ సమీప కరకట్ట ప్రాంతం నుంచి పట్టణంలోకి వరద నీరు ప్రవేశించకుండా ఉండేందుకు అధికారులు విజయవాడ–జగదల్‌పూర్ జాతీయ రహదారిపై మట్టికట్ట ఏర్పాటు చేశారు. ఫలితంగా జాతీయ రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. భద్రాచలం మీదుగా వెళ్లే వందలాది లారీలు, ఇతర వాహనాలు పట్టణంలోనే నిలిచిపోయాయి. ఏపీలోని గుండాల, రాయనిపేట, నెల్లిపాక ప్రాంతాల్లో కూడా రహదారిపై సుమారు ఐదు అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తుండటంతో ఆదివారం మధ్యాహ్నం వరకు రహదారి పునరుద్ధరణ సాధ్యంకాదని అధికారులు తెలిపారు.

### క్షేత్రస్థాయిలో పరిస్థితుల పరిశీలన

జిల్లా కలెక్టర్ అంకిత్ శనివారం భద్రాచలం—కూనవరం ప్రధాన రహదారి వెంట వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహం, ప్రభావిత గ్రామాల పరిస్థితి, సహాయక చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్న నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను టామ్‌టామ్, మైకింగ్ ద్వారా నిరంతరం అప్రమత్తం చేయాలని, వరద ముప్పు ఉన్న గ్రామాల ప్రజలను ఆలస్యం చేయకుండా సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, నాణ్యమైన ఆహారం, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.







# ఎస్సారెస్పీలో పూడిక తీతకు ప్రాధాన్యం





### ప్రాజెక్టును పరిశీలించిన మంత్రుల బృందం

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు01 (డీడీ9 వార్త) :**

గోదావరి పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో నిజామాబాద్ జిల్లాలోని ప్రతిష్టాత్మక శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) జలకళను సంతరించుకుంది. శనివారం భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు మంత్రులు డి. శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డిల బృందం పోచంపాడ్‌కు తరలివచ్చింది. మంత్రుల బృందానికి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, సీపీ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావు, ఎస్సారెస్పీ సీఈ సునితాదేవి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు తదితరులు పూలమొక్కలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు డ్యామ్ పైభాగానికి చేరుకుని, ఎగువన మహారాష్ట్రలోని ప్రాజెక్టులతో పాటు కడెం నుంచి ప్రవహిస్తూ ఎస్సారెస్పీలోకి చేరుతున్న వరద ఉధృతిని సుదీర్ఘంగా పరిశీలించారు. అధికారుల వివరాల ప్రకారం ప్రస్తుతం ఎస్సారెస్పీలో నీటి నిల్వ 27.376 టీఎంసీలకు చేరింది. గోదావరిలో ఎగువ నుంచి ప్రవాహాలు ఇంకా కొనసాగుతుండటంతో రాబోయే రెండు రోజుల్లో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఎస్సారెస్పీ నీటి సామర్థ్యం పూడిక వల్ల తగ్గిపోయినందున, త్వరితగతిన పూడిక తీత చర్యలకు శ్రీకారం చుట్టబోతున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. గత బిఆర్ఎస్ పాలనపై మంత్రులు తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. మేడిగడ్డ, సుందిళ్ల వంటి నిర్మిత బ్యారేజీలు అవసరం లేకుండానే కేవలం సహజ ప్రవాహాల ద్వారా ఎల్లంపల్లి రిజర్వాయర్‌లోకి 20 టీఎంసీల నీరు వచ్చి చేరిందనే విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. గత పాలకుల కక్కుర్తి చర్యల వల్లే ఆ బ్యారేజీలు మూడేళ్లకే నిరుపయోగంగా మారాయని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి సహా పలువురు కాంగ్రెస్ ముఖ్య నేతలు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నేడు నిజామాబాద్ లో 'ఊర పండగ'..

### నగరంలో ట్రాఫిక్ మళ్లింపులు

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు01 (డీడీ9 వార్త) :**



నిజామాబాద్ నగరంలో ఆదివారం నిర్వహించనున్న 'ఊర పండగ' శోభాయాత్రను పురస్కరించుకుని నగరంలో పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, దారి మళ్లింపులు విధిస్తున్నట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు ఖిల్లా చౌరస్తా నుంచి ప్రారంభమయ్యే పండుగ ఊరేగింపు వివేకానంద స్టాచ్యూ, గాజులపేట, గురుద్వారా, లక్ష్మి మెడికల్స్, గోల్-హనుమాన్ జంక్షన్ మీదుగా వినాయక్ నగర్ మరియు దుబ్బా వైపు సాగనుంది. ఊరేగింపు నేపథ్యంలో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు బోధన్ వైపు నుంచి వచ్చే, వెళ్లే ఆర్టీసీ బస్సులు మరియు ఇతర భారీ వాహనాలను బైపాస్ రోడ్డు గుండా మళ్లించనున్నారు. ఈ వాహనాలు ఆర్టీసీ బస్టాండ్ వెనుక వైపు నుంచి రైల్వే స్టేషన్, ఎన్టీఆర్ చౌరస్తా, జెడ్పీ చౌరస్తా, కంటేశ్వర్, మీ-సేవ, కంటేశ్వర్ బైపాస్, ఐడీఓసీ మీదుగా అర్సపల్లికి చేరుకుని బోధన్ వైపు ప్రయాణించాల్సి ఉంటుంది. కాగా హైదరాబాద్, బాన్సువాడ మార్గాల్లో ప్రయాణించే వాహనాలు ఎలాంటి దారి మళ్లింపులు లేకుండా యథాతథంగా కొనసాగుతాయని, నగర ప్రజలు ఈ ట్రాఫిక్ మార్పులను గమనించి పోలీసులకు సహకరించాలని సీపీ విజ్ఞప్తి చేశారు.